# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:80 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రముఖ నటులు చంద్రమోహన్ కన్నుమూత

### – ముఖ్య మంత్రి కేసీఆర్ సంతాపం



హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రముఖ నటులు చంద్రమోహన్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ అపోలో దవాఖానలో శనివారం ఉదయం 9.45 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.కాగా ప్రముఖ నటుడు చంద్రమోహన్ మృతిపట్ల ముక్యమంత్రి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రమోహన్ దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరించారని.. ఆయన మృతి తెలుగు చలన చిత్ర పరిశ్రమకు తీరనిలోటన్నారు. ఆయన స్ఫూర్తితో ఎందరో నటీనటులుగా ఎదిగారని చెప్పారు. తెలుగు, ఇతర భాషల్లో లక్షలాదిమంది అభిమానాన్ని సొంతం చేసుకున్నారని తెలిపారు.




## పనిచేసే ప్రభుత్వాన్నే ప్రజలు ఆశీర్వదిస్తారు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 11:ప్రజలు పనిచేసే ప్రభుత్వాన్నే ఆశీర్వదిస్తారని మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో పార్ట్‌నర్స్ ఇన్ ప్రోగ్రెస్ ప్రోగ్రామ్‌లో మంత్రి పాల్గొన్నారు. జేఆర్‌సీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం గణనీయంగా అభివృద్ధి చేసిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో మంచి పురోగతి సాధించామని చెప్పారు. తాము చేసిన అభివృద్ధి విూ కళ్ల ముందే కనిపిస్తోందన్నారు.

హైదరాబాద్‌లో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని మంత్రి చెప్పారు. ఈ మహానగరానికి చారిత్రకంగా గొప్ప పేరుందని అన్నారు. పాత హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందినదని నటుడు రజినీకాంత్ పొగిడిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అభివృద్ధిలో హైదరాబాద్ న్యూయార్క్‌తో పోటీ పడుతోందని అన్నారు.

గత పదేళ్లలో నగరంలో 36 ఫ్లైవోర్లు నిర్మించామని, 39 చెరువులను నవీకరించామని మంత్రి చెప్పారు. మిషన్ భగీరథ కార్యక్రమంతో హైదరాబాద్‌లో తాగునీటి సమస్య లేకుండా చేశామని తెలిపారు. అదేవిధంగా దేశంలో నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని గుర్తుచేశారు.

## కేసీఆర్‌కు ముందు తండాల పరిస్థితి ఏందీ..? ఇప్పుడేంది..? ఆలోచన చేయాలి : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 11: కేసీఆర్‌కు ముందు తండాల పరిస్థితి ఏందీ..? ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో ఆలోచన చేయాలని మంత్రి హరీశ్‌రావు గిరిజనులకు సూచించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎంపీ సీతారాం నాయక్, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి సమ్మేళనానికి వచ్చిన గిరిజన ప్రజాప్రతినిధులకు పేరు పేరున అభినందనలు తెలిపారు. కేసీఆర్‌కు ముందు.. కేసీఆర్‌కు తర్వాత అని ఒక్కసారి గుండె మీద చెయ్యి వేసుకొని ఆలోచన చేయాలన్నారు. ఆనాడు తాగునీళ్ల కోసం ఎంత కష్టపడ్డారో చూడాలన్నారు. నారాయణ ఖేడ్‌లో బిందెలతో ఎన్నో పోరాటాలను జరిగిన గుర్తు చేశారు. ఆనాడు తండాలు మంచం ఎక్కాయని.. విష జ్వరాలతో గిరిజన గూడాలని పేపర్లలో హెడ్డింగులు వచ్చేవని గుర్తు చేశారు.

### నేడు తాగునీటి కష్టాలు లేవు

ఇవాళ తాగునీటి కష్టాలు లేవని, మిషన్ భగీరథ కార్యక్రమంతో ప్రతి ఇంటికి మంచి నీళ్లు ఇస్తున్నామన్నారు. 2009లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో తాండాలను గ్రామ పంచాయతీలు చేస్తామని పెట్టిందని.. మరి చేసిందా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత అన్ని తాండలను గ్రామ పంచాయతీలు చేశారన్నారు. ఆనాడు తండాలను గ్రామ పంచాయతీలు చేయాలని ఎన్నో పోరాటాలు.. ఎన్నో ఉద్యమాలు జరిగాయన్నారు. తాను కూడా తండాలను గ్రామ పంచాయతీలుగా చేయాలని పోరాటంలో పాల్గొన్నట్లు తెలిపారు. 4.50లక్షల ఎకరాల పోడు భూములకు సీఎం కేసీఆర్ పట్టాలు ఇచ్చారని.. ఆ భూములకు రైతుబంధు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. ప్రతి గిరిజన బిడ్డ చదువుకోవాలని గిరిజన గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని, విదేశీ విద్య పథకం పెట్టి ఎందరికో విదేశీ విద్యను అందించిందన్నారు.

### ఆత్మగౌరవంతో బతకాలని..

గిరిజన బిడ్డలు ఆత్మగౌరవంతో బతకాలని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. బంజారాహిల్స్‌లో గిరిజన ఆదివాసీ బిడ్డలు ఆత్మగౌరవంతో బతకాలని బంజారా, ఆదివాసీ భవనాలను కట్టించారన్నారు. విద్య, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. రిజర్వేషన్లతో ఎంతో మంది గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారన్నారు. గిరిజన గూడేలకు, తండాలకు త్రీ ఫేజ్ కరెంట్ ఏర్పాటు చేశారన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తే గిరిజనబంధు ఇస్తారన్నారు. గ్రామ పంచాయతీలు కొత్తవి కట్టుకుంటునాన్నమని, అలాగే తండాల్లో బంజారా భవనాలు కట్టుకుందామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనలకు ఎంతో మేలు చేశారని, పెట్టుబడులు లేక అప్పులు ఆనాడు చేశారని.. కానీ ఇప్పుడు కేసీఆర్ ఇస్తున్న రైతుబంధు గిరిజనులకు వరంగా మారిందని మంత్రి తెలిపారు. కొంతవంది ప్రతిపక్ష పార్టీల నాయకులు రైతుబంధు దండగ, దుబారా అంటున్నారన్నారు.



### మాట తప్పిన కాంగ్రెస్ ఓ వైపు.. మాట తప్పని కేసీఆర్ ఓ వైపు..

ఎన్నికల్లో గెలువగానే ప్రతి రేషన్‌కార్డు ఉన్న వారికి సన్న బియ్యం ఇస్తామని, గ్యాస్ సిలిండర్ రూ.400 ఇస్తామన్నారు. మాట తప్పిన కాంగ్రెస్ పార్టీ ఒక్కవైపు ఉంటే.. మాట తప్పని కేసీఆర్ ఒకవైపు ఉన్నారన్నారు. మీరంతా సేవాలాల్, కొమరం భీం వారసులని.. అందరూ సరైన ఆలోచన చేయాలన్నారు.

అన్నం తిన్న రేవు మరవొద్దని.. కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ కల్యాణ లక్ష్మి, రైతుబంధు బంధు ఇవ్వలేదని.. అలాంటప్పుడు ఎందుకు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ఆనాడు ప్రభుత్వ హాస్పిటల్స్ ఎలా ఉండే.. ఇప్పుడు ఎలా ఉన్నాయన్నారు. పని తనం తప్ప పగ తనం తెల్వదని.. 24 గంటలు ప్రజల కోసం ఆలోచన చేసే వ్యక్తి మన ముఖ్యమంత్రన్నారు.

### డిసెంబర్ 3 తర్వాత రుణమాఫీ

టికెట్లు ఇవ్వాలి అంటే కర్ణాటక వాళ్లు.. ఓటర్లకు డబ్బులు ఇవ్వాలి అంటే కర్ణాటక కాంగ్రెస్ వాళ్లు.. ప్రచారం కోసం కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తున్నారన్నారు. తెలంగాణకు కృష్ణా నదిలో నీళ్ల పంచాయతీ ఉన్నది.. మరి అలాంటప్పుడు కర్ణాటకతో కాంగ్రెస్ వాళ్లు కొట్లాడుతారా..? అని ప్రశ్నించారు.

బ్రిజేష్ ట్రిబ్యునల్ పంచాయతీ ఇంకా ఉందని.. ఐటీ కంపెనీలు ఎన్నో ఇక్కడ ఉన్నాయని.. ఇక్కడ ఉన్న అంతర్జాతీయ కంపెనీలు కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తారన్నారు. రైతు రుణమాఫీ ఇచ్చామని.. మిగతా రూ.4వేలకోట్లు సైతం ఈసీ అనుమతి ఇస్తే పూర్తిగా రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేయకుండా అడ్డుకుంటుందని ఆరోపించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమని.. వచ్చే నెల 3వ తేదీ తర్వాత రుణమాఫీ చేసుకుందామన్నారు.

## మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వరంగల్ జనసేన ఇన్‌చార్జి




వరంగల్, నవంబర్ 11: వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో జనసేన తూర్పు ఇన్‌చార్జి తాళ్లపెల్లి బాలుగౌడ్, వరంగల్ 42వ డివిజన్ స్వతంత్ర కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, ఉద్యమ నాయకుడు అచ్చ విద్యాసాగర్‌తో పాటు మరికొందరు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు.

ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, బీఆర్ఎస్ వరంగల్ తూర్పు ఎన్నికల ఇన్‌చార్జి బండా ప్రకాష్, ఎమ్మెల్యే, తూర్పు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతోనే సర్పంచులుగా అవకాశం : మంత్రి సత్యవతి



హైదరాబాద్, నవంబర్ 11: సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతోనే సర్పంచులుగా అవకాశం దక్కిందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మేడ్చల్ జిల్లా శామిర్‌పేటలో జరిగిన గిరిజనుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇవాళ అనేక గిరిజన గురుకుల పాఠశాలలు వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత మంది గిరిజన బిడ్డలు ప్రజా ప్రతినిధులుగా ఉన్నామంటే కేసీఆర్ భిక్షనేనన్నారు. తండాలు గ్రామ పంచాయతీలు కావడంతో ఇవాళ ఇంత మంది సర్పంచులుగా అవకాశం వచ్చిందన్నారు.

గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు కట్టించారని, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు కావాలంటే.. సీఎం కేసీఆర్ రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఇందులో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఎంతో కృషి ఉందన్నారు. 4.5లక్షల ఎకరాల పోడు భూములకు ఒక్కసారి పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఐదు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీలో అధికారంలో ఉన్నా తండాలను గ్రామ పంచాయతీలుగా చేయలేదన్నారు. మనను మోసం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే.. అది కాంగ్రెస్ పార్టీయేనన్నారు.

గిరిజనులను జాగృతం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని.. అడిగింది ఇచ్చిన నాయకుడు మన కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ మరో పదేళ్లు అధికారంలో ఉంటే లాభం జరుగుతుందన్నారు. లాంబాడాలకు షేరు సారా పోస్తే ఓట్లు వేస్తారని మనల్ని అవహేళన చేసి మాట్లాడిన వ్యక్తికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రూ.4వేల కోట్లతో ప్రతి తండాకు రోడ్లు వేసుకున్నామని, కొమ్రుంభీం, సేవాలాల్ జయంతి, వర్ధంతిని అధికారికంగా జరిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించలేదని.. గిరిజన యూనివర్సిటీని బీజేపీ ప్రభుత్వం ఆలస్యం చేసిందన్నారు. అందరం మరొక్క సారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

## చంద్రమోహన్ మరణ వార్తతో ఇండస్ట్రీలో తీవ్ర విషాద ఛాయలు



హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ సీనియర్ నటుడు చంద్రమోహన్ (82) మరణ వార్తతో ఇండస్ట్రీలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఇండ్రస్టీలో లక్కీ హీరోగా పేరు పొందిన ఆయన 900కుపైగా చిత్రాల్లో నటించారు. ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో మెప్పించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ సినీ ప్రస్థానం గురించి తెలుసుకుందాం.

### చంద్రమోహన్‌గా మారి..

చంద్రమోహన్ అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖర్‌రావు 1942 మే 23న కృష్ణా జిల్లా పమిడిముక్కలలో జన్మించారు. బాపట్లలో అగ్రికల్చర్ బీఎస్సీ చదివారు. చదువుకునే రోజుల నుంచే నాటకాలు వేయడంలో ఆయన దిట్ట. అదే పట్టుతో చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం చేయకుండా చిత్రసీమవైపు పరుగు తీశారు. మద్రాసు వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించారు. ఆరంభంలోనే బీఎన్‌రెడ్డి వంటి మేటి దర్శకుని దృష్టిలో పడ్డారు.ఆయనే చంద్రశేఖర్‌కు చంద్రమోహన్ అని నామకరణం చేశారు. ఇక అప్పటి నుంచి ఆయన చంద్రమోహన్‌గానే పరిచయం అయ్యారు. బీఎన్‌రెడ్డి తెరకెక్కించిన 'రంగులరాట్నం' చిత్రంలో కథానాయకుడిగా పరిచయమైన చంద్రమోహన్, తరువాత తన దరికి చేరిన పాత్రలన్నింటికీ న్యాయం చేయడానికి పరితపించారు. నాటి మేటి నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కాంతారావు, జగ్గయ్యతో కలిసి పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించే అవకాశం దక్కించుకున్నారు. ఆ తర్వాత తన తరం నటులు శోభన్ బాబు, కృష్ణ, కృష్ణం రాజు నటించిన చిత్రాల్లోనూ ముఖ్యపాత్రల్లో నటించి తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. ఒకానొక దశలో మినిమమ్ గ్యారంటీ హీరో అనిపించుకున్నారు. ఆ సమయంలో ఏడాదికి ఇరవై చిత్రాల్లో నటించి భళా అనిపించారు చంద్రమోహన్.

### రెండు ఫిలింఫేర్, ఆరు నంది అవార్డులు

ఇండ్రస్టీలో లక్కీ హీరోగా పేరున్న చంద్రమోహన్ తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించేవారు. ఎందరో నటీమణులు ఆయన సరసన హీరోయిన్లు తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర తారలుగా వెలుగొందారు. దాదాపు 175 సినిమాల్లో హీరోగా నటించిన ఆయన.. మొత్తంగా 900కుపైగా సినిమాల్లో యాక్ట్ చేశారు. 1966లో రంగుల రాట్నం సినిమాతో అరంగేట్రం చేసిన ఆయన ఇప్పటివరకు రెండు ఫిలింఫేర్, ఆరు నంది అవార్డులు అందుకున్నారు. పదహారేళ్ల వయసు, సిరిసిరి మువ్వ సినిమాలకు ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ అవార్డులు, 1987లో చందమామ రావే సినిమాకు ఉత్తమ కమెడీయన్‌గా నంది అవార్డు, 2005లో అతనొక్కడే సినిమాకు ఉత్తమ సహాయకుడిగా నంది అవార్డు అందుకున్నారు.

### చంద్రమోహన్‌తో నటించేందుకు హీరోయిన్స్ పోటీ..

ప్రముఖ దర్శకులు కళాతపశ్వి కె.విశ్వనాథ్.. చంద్రమోహన్‌కు అన్న వరుస అవుతారు. ప్రతిభ లేకుంటే ఏ అన్న కూడా ఆదరించలేడు కదా..! అలాగే విశ్వనాథ్ తన చిత్రాల్లో చంద్రమోహన్‌కు తగ్గ పాత్రలుంటే తప్పక అతణ్ణే పిలిపించేవారు. విశ్వనాథ్ దర్శకత్వంలో చంద్రమోహన్ నటించిన సీతామాలక్ష్మి, సిరిసిరిమువ్వ, శంకరాభరణం, శుభోదయం వంటి చిత్రాలు మంచి పేరు సంపాదించి పెట్టాయి. ఇంటింటి రామాయణం, పదహారేళ్ళ వయసు, తాయారమ్మ-బంగారయ్య, కోరికలే గుర్రాలయితే, సత్యభామ, పక్కింటి అమ్మాయి, గోపాలరావుగారి అమ్మాయి, పెళ్ళిచూపులు, రాధాకళ్యాణం, మూడుముళ్ళు మొదలైన చిత్రాల్లోనూ చంద్రమోహన్ హీరోగా నటించి మెప్పించారు. ఆయన సరసన నాయికలుగా నటించిన జయప్రద, జయసుధ, శ్రీదేవి, విజయశాంతి వంటి వారంతా టాప్ హీరోయిన్స్ అయ్యారు. అప్పటి నుంచీ కొత్త అమ్మాయిలు చంద్రమోహన్ సరసన నటించడానికి ఉత్సాహం ప్రదర్శించేవారు.

### చివరి సారిగా..

తన పర్సనాలిటీకి ఎప్పుడూ హీరో వేషాలే రావని అనుకున్న చంద్రమోహన్.. ఓ వైపు కథానాయకుడిగా నటిస్తూనే మరోవైపు ఇతరుల చిత్రాల్లోనూ కీలక పాత్రలు పోషించేవారు. అదే ఆయన కెరీర్‌ను ఇంతకాలం లాక్కొచ్చిందని చెప్పవచ్చు. తరువాతి తరం హీరోల చిత్రాల్లోనూ అన్నగా, బావగా, మామగా, తండ్రిగా నటించి మెప్పించిన చంద్రమోహన్ ఇప్పటి యంగ్ హీరోస్ సినిమాల్లో తాతగానూ కనిపిస్తున్నారు. ఆయన చివరి చిత్రం గోపీచంద్ నటించిన 'ఆక్సిజన్'. ఆ తర్వాత అనారోగ్యం, వయసు రీత్యా నటనకు దూరంగా ఉంటున్నారు.

చంద్రమోహన్‌కు భార్య జలంధర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య ప్రముఖ రచయిత్రి. ఇద్దరు పిల్లల్లో పెద్దామ్మాయి మీనాక్షి సైకాలజిస్ట్. అమెరికాలో స్థిపరడ్డారు. రెండో కుమార్తె మాధవి. ఆమె కూడా డాక్టర్. ప్రస్తుతం చెన్నైలోనే ఉంటున్నారు.

## అంబర్‌పేట్‌లో కాలేరుకు అన్ని వర్గాల మద్దతు

### -ఘనంగా బసంత్ కాలనీలో ఎమ్మెల్యేకాలేరు ఎన్నికల ప్రచార పాదయాత్ర

### -"బీఆర్ఎస్ రావాలి - కాలేరు కావాలి" అంటూ నినదించిన ప్రజలు

హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); అంబర్పేట నియోజకవర్గం లో నివసిస్తున్న అన్ని వర్గాల ప్రజలు తనకు మద్దతు పలుకుతున్నారని అంబర్పేట ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. ఈ రోజు కాచిగుడా డివిజన్, బసంత్ కాలనీ మరియు ఓల్డ్ బసంత్ థియేటర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీ భీష్మ దేవ్, డా శిరీష ఓం ప్రకాష్ యాదవ్, సీనియర్ నాయకులు శ్రీ దిడ్డి రాంబాబు గార్లు, పార్టీ నేతలు మరియు కార్యకర్తలతో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచార పాదయాత్ర ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే గారు ప్రజలు, మరియు పెద్ద సంఖ్యలో అక్కడ నివసిస్తున్న జైన్ సముదాయ వర్గాల వారికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు మరియు జైన్ సమాజం కోసం చేస్తున్న కృషిని తెలిపి, బీఆర్ఎస్ ను గెలిపించవల్సిందిగా విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజలు ప్రభుత్వం అందించిన సంక్షేమంతో సంతృప్తి వ్యక్తం చేయగా, జైన్ సంఘాల నాయకులు సీఎం కేసీఆర్ జైన్ సమాజానికి అండగా నిలవడమే కాకుండా, గత నెలలో, తమకు ప్రత్యేక భవనం నిర్మించుకోవడానికి రెండు ఎకరాల భూమిని కూడా అందించి చాలా పెద్ద తోడ్పాటు అందించారని పేర్కొంటూ, తామందరం కాలేరు వెంకటేష్ గారికి మద్దత్తు ఇస్తామని ప్రకటించారు.కాచిగుడా డివిజన్, బసంత్ కాలనీ మరియు ఓల్డ్ బసంత్ థియేటర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , డివిజన్ ప్రెసిడెంట్ శ్రీ



భీష్మ దేవ్,డా. శిరీష ఓం ప్రకాష్ యాదవ్, సీనియర్ నాయకులు శ్రీ దిడ్డి రాంబాబు గార్లు, పార్టీ నేతలు మరియు కార్యకర్తలతో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచార పాదయాత్ర ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ప్రజలు, మరియు పెద్ద సంఖ్యలో అక్కడ నివసిస్తున్న జైన్ సముదాయ వర్గాల వారికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు మరియు జైన్ సమాజం కోసం చేస్తున్న కృషిని తెలిపి, బీఆర్ఎస్ ను గెలిపించవల్సిందిగా విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజలు ప్రభుత్వం అందించిన సంక్షేమంతో సంతృప్తి వ్యక్తం చేయగా, జైన్ సంఘాల నాయకులు సీఎం కేసీఆర్ జైన్ సమాజానికి అండగా నిలవడమే కాకుండా, గత నెలలో, తమకు ప్రత్యేక భవనం నిర్మించుకోవడానికి రెండు ఎకరాల భూమిని కూడా అందించి చాలా పెద్ద తోడ్పాటు అందించారని పేర్కొంటూ, తామందరం కాలేరు వెంకటేష్ మద్దత్తు ఇస్తామని ప్రకటించారు.

## రేవంత్‌రెడ్డి భాష మార్చుకో.. నోరు అదుపులో పెట్టుకో.. : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, నవంబర్ 11:రేవంత్‌రెడ్డి భాష మార్చుకోవాలని.. నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ అభ్యర్థులతో తలసాని అధ్యక్షతన సమావేశం జరిగింది. భేటీలో నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రచార సరళి, ఈ నెల 17 నుంచి జరిగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు రోడ్ షో, 25న జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నోటికి అడ్డు అదుపూ లేని ఒక మూర్ఖుడిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించిందని విమర్శించారు.

ఉన్నత పదవుల్లో ఉన్న వారిపై వ్యక్తిగత విమర్శలు, దూషణలు చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పందిచక పోవడం విచారకరమన్నారు. తాము అంతకంటే ఎక్కువగా మాట్లాడగలమని, మాకు సంస్కారం అడ్డు వస్తుందని చెప్పారు. ప్రజలు కూడా గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ ఎన్నికల ప్రచారంలో విధానాలపై ప్రజలకు వివరించాలే కానీ పరుష పదజాలం ఉపయోగించడంపై కాంగ్రెస్ అధిష్టానం స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, ఈటల రాజేందర్ తమను తాము అతిగా ఊహించుకుంటున్నారని, తమ తమ నియోజకవర్గాల్లో ఓడిపోతామని తెలిసి తమ పార్టీ అధిష్టానాల మెప్పు కోసం ముఖ్యమంత్రిపై పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు.

ఓడిపోతాననే భయంతోనే బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గంలో పోటీకి దూరంగా ఉన్నారని విమర్శించారు. రెండు సీట్లు కూడా గెలవని బీజేపీ బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, మాగంటి గోపినాద్, దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, నాంపల్లి, కంటోన్మెంట్, గోషా మహల్ అభ్యర్థులు ఆనంద్ గౌడ్, లాస్య నందిత, నంద కిషోర్ వ్యాస్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



### నేటి కందం- నేటికి అందం

కం॥ లాంఛనగ సిరి సంపదలిడి
ధావున విఘ్నేశులనిడ టంకములిడుచున
దేవీ దేవత తెల్లరు
జీవన శతములనిడెదరు దీపావళి లోన్॥

(12-11-23 దీపావళి పండుగ..)



-రాధశ్రీ

సెల్:9494481210

# న్యుమోనియా విషవలలో బాలభారతం..!

## (12 నవంబర్ "ప్రపంచ న్యుమోనియా దినం" సందర్భంగా)

బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ లాంటి సూక్ష్మజీవులు వ్యాప్తితో ఐదేళ్ళలోపు పిల్లల్లో కనిపించే ప్రమాదకర అంటువ్యాధి న్యుమోనియా వ్యాధి బారిన 155 మిలియన్ల బాలలు పడడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 1.6 మిలియన్ల మంది పిల్లలు మరణించడం జరుగుతోంది. న్యుమోనియా వ్యాధి 65 ఏండ్లు దాటిన వృద్ధుల్లో కూడా కనుపించడం, అత్యధిక మరణాలు నమోదు అవుతున్న అంటువ్యాధి కావడం చూస్తున్నాం. ఐరాస అంచనాల ప్రకారం విశ్వవ్యాప్తంగా 18 శాతం పిల్లల మరణాలకు ప్రథమ కారణమైన న్యుమోనియా నివారించగల అంటువ్యాధి. ఈ వ్యాధి ముందుగా గుర్తించలేనిదిగా మాత్రమే కాకుండా నిశ్శబ్దంగా, విస్తృతంగా, ప్రమాదకరంగా వ్యాప్తి కూడా చెందుతున్నది. యూనిసెఫ్ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 39 క్షణాలకు ఒక న్యుమోనియా మరణం నమోదు అవుతున్నదనే విషయం భయాన్ని కలిగిస్తున్నది.

### ప్రపంచ న్యుమోనియా దినం – 2023 నినాదం:

ప్రాణాంతక న్యుమోనియా వ్యాధి పట్ల సంపూర్ణ అనగాహన కలిగించాలనే సదుద్దేశంతో 2009 నుంచి ప్రతియేటా 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటించడం జరుగుచున్నది. ప్రపంచ న్యుమోనియా దినం – 2023 నినాదంగా "ఎవ్రీ బ్రీత్ కౌంట్స్ : స్టాప్ న్యుమోనియా ఇన్ ఇట్స్ ట్రాక్" అనబడే అంశాన్ని తీసుకున్నారు. సరైన చికిత్స, టీకాలు అందుబాటులో ఉన్న న్యుమోనియా వ్యాధి భయంకర బ్యాక్టీరియా 'హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా టైప్–బి','స్ట్రెప్టోకోకస్ న్యుమోనియే'లు సోకడం వల్లనే కాకుండా 'ఆర్థోమైక్సోవైరిడే' అనబడే వైరస్ కారణంగా కూడా సంక్రమిస్తుంది. ఐరాస మిలినియమ్ డెవలప్‌మెంట్ గోల్స్ ప్రకారం 192 దేశాల్లో న్యుమోనియా కారణ మరణాలను తగ్గించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా నైజీరియా(1.62,000), ఇండియా(1,27,000), పాకిస్థాన్(58,000), కాంగో(40, 000), ఇథియోపియా(32,000)ల్లో న్యుమోనియా మరణాలు ఉన్నాయి.

### న్యుమోనియా వ్యాప్తి మార్గాలు, రోగ లక్షణాలు:

వెనుకబడిన పేదదేశాల్లో పోషకాహారలోపం, అపరిశుభ్రత, ఆహార కొరత, ఇరుకైన ఇండ్లు, పొగ తాగే వారు ఉండడం, గాలి కాలుష్యం లాంటి కారణాలతో న్యుమోనియా వ్యాధి అధిక బాలల మరణాలకు దారి తీస్తున్నది. న్యుమోనియా నివారణ, చికిత్సలతో సకాలంలో స్పందిస్తే కనీసం ఒక మిలియన్ బాలల మరణాలను అడ్డుకోవచ్చని యునిసెఫ్ అభిప్రాయ పడుతున్నది. బ్యాక్టీరియా/వైరస్/ఫంగస్/పరాన్న సూక్ష్మజీవులు సంక్రమించడంతో సోకే న్యుమోనియా వల్ల బాలల ఊపిరితిత్తుల క్రియాశీలత క్షీణించడం, జ్వరం, దగ్గు, బలహీనత, ఊపిరి పీల్చడం కష్టమవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. న్యుమోనియా సోకిన వ్యక్తి దగ్గడం, తుమ్మడం వల్ల విడుదలయ్యే సూక్ష్మ తుంపరలతో సమీప వ్యక్తులకు వ్యాధి సంక్రమిస్తుంది. వయోవృద్ధులు, టీకాలు వేయించుకోలేని శిశువులకు ఇది ప్రాణాంతకంగా మారుతుంది.

### న్యుమోనియా నివారణ మార్గాలు:

సులభంగా వ్యాక్సీన్‌లతో నివారించగలిగిన న్యుమోనియా వ్యాధికి తగు చికిత్స మార్గాలు కూడా అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రతి రోజు 5 ఏండ్ల లోపు పిల్లలు 2400 మంది చనిపోవడం విచారకరం. దేశ భావిభారత పౌరులైన పిల్లలకు సురక్షిత త్రాగు నీరు, పరిశుద్ధ గాలి, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాక్సినేషన్, కనీస వైద్యసదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉండాలి. వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవడం, టీకాలు వేయించడం, తొలి దశలో న్యుమోనియాను గుర్తించడం, సరైన ఆంటీబయాటిక్ ఔషధాలతో చికిత్సను వారం రోజులు అందించడం వల్ల న్యుమోనియా వ్యాధి నయం అవుతుంది. శిశువులకు తల్లిపాలు అందించడం, పోషకాహారంతో వ్యాధినిరోధకత పెంచడం కూడా మంచి ఫలితాలను ఇస్తుందని గమనించాలి. 2030 వరకు న్యుమోనియా రహిత సమాజం నిర్మించాలనే లక్ష్యంతో పలు చర్యలు తీసుకుంటున్నారు. సంక్రమిత వ్యాధుల్లో న్యుమోనియా నిరోధక టీకాలను 52 శాతం పిల్లలు నేటికీ తీసుకోకపోవడం సమస్య గంభీరతను తెలియజేస్తున్నది.

### ఇండియాలో న్యుమోనియా:

న్యుమోనియా కారణ మరణాల సంఖ్యలో ఇండియా 2వ స్థానంలో ఉన్నది. భారత్‌లో సాలీనా 10 మిలియన్ల న్యుమోనియా కేసులు నమోదు కావడం, ప్రాణాంతకంగా మారడం విచారకరం. పిల్లల మరణాల్లో 15 శాతం న్యుమోనియా వల్ల జరుగుతున్నాయి. భారతదేశ అంటువ్యాధుల్లో 70 శాతం న్యుమేనియా సంబంధ కారణంగా జరుగుచున్నాయి. గాలి కాలుష్య న్యుమోనియా వల్ల 50 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా న్యుమోనియా సోకిన 32 శాతం పిల్లలకు వైద్య సహాయం అందడం లేదు. యూనిసెఫ్ అంచనాల ప్రకారం గత 5 ఏండ్లలో న్యుమోనియా వల్ల 8 లక్షల పిల్లలు మరణించగా, పుట్టిన మాసం లోపు 1,53,000 పిల్లలు మరణించడం జరుగుచున్నది. 2030 వరకు న్యుమోనియాను గుర్తించడం, నిరోధించడం, చికిత్స చేయడానికి 18 మిలియన్ల ఆరోగ్య సిబ్బంది అదనంగా అవసరం ఉంటుందని తేల్చారు.

సరైన జీవనశైలితో రక్షణ పొందడం, వ్యాక్సీన్ వేయించడం, తొలి దశలో గుర్తించి చవకైన చికిత్స మార్గాలు ఎంచుకోవడంతో న్యుమోనియా వ్యాధి బారిన పడకుండా భావిభారత పౌరులు రక్షించబడతారనే అవగాహన కలిగి మన పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం. నిర్లక్ష్యానికి ప్రతిఫలంగా జనించే నిశ్శబ్ద న్యువోనియా అంటువ్యాధి పట్ల అప్రమత్తంగా ఉందాం, ఆరోగ్య సమాజాన్ని నిర్మించుకుందాం.



– డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఏపీలో ఎప్పటికైనా అధికారంలోకి వస్తాం.. డీకే శివకుమార్



అమరావతి, నవంబర్ 11:ఏపీలో ఎప్పటికైనా అధికారంలోకి వస్తామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రత్యేక హోదా, రాజధాని, ఏపీ అభివృద్ధి అంశాల్లో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని డీకే శివకుమార్ పునరుద్ఘాటించారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఏపీ సీసీ కార్యాలయానికి వచ్చిన కర్ణాటక డిప్యూటీ సీఎం కుమార్ కు ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, సుంకర పద్మశ్రీ ఇతర కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ నిన్న తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలు ప్రభుత్వ మార్పు కోరుకుంటున్నారనీ చెప్పారు. కాంగ్రెస్ వేవ్ అక్కడ నడుస్తుంది.. సోనియా పై విశ్వాసంతో ఉన్నారన్నారు.

రేపు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏపీలో కూడా ఏదో ఒకరోజు తప్పకుండా అధికారంలోకి వస్తుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తప్పకుండా ఏపీ ప్రజలు కాంగ్రెస్ నే ఆదరిస్తారన్నారు. నేటి కార్యకర్తలే రేపటి నాయకులు, మంత్రులుగా చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో అందరూ ఇలా ఎదిగిన వారే అని గుర్తు చేశారు. కుర్చీ కావాలంటే కుర్చీ కోసం పోరాడాలన్నారు. పని చేసేవాడిని జాగ్రత్తగా చూసుకుంటే పార్టీ బలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ చరిత్ర దేశ చరిత్ర అన్నారు. పాలిటిక్స్ లో ఎవరూ శాశ్వతం కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాజధాని అంశం, ప్రత్యేక హోదా, అభివృద్ధి అంశాలపై కాంగ్రెస్ ఏపీకి కమిట్మెంట్ ఇచ్చిందన్నారు. దానికి ఎప్పటికీ కట్టుబడి ఉంటామన్నారు. జాతీయ పార్టీలు యాక్టివ్ గా లేకపోవడం ఏపీలో అభివృద్ధి లేకపోవడానికి కారణం గా కనిపిస్తుందన్నారు. ఇండియా కూటమిగా మనతో 26 పార్టీలు కలిసి పనిచేస్తాయన్నారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ కారణంగా దేశం సంయుక్తంగా ఉందన్నారు. నమ్మకాన్ని కోల్పోవద్దు? సమస్యలపై పోరాడండని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కలిసి ఆలోచించి పనిచేయాలి? అదే గెలుపు కారణంగా ఉంటుందన్నారు.

**జగన్మాత సేవలో డీకే శివకుమార్.. ఘనస్వాగతం పలికిన ఆలయ అధికారులు..**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి సేవలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. అమ్మవారి ఆలయానికి శనివారం వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం డీకే శివకుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు డీకే శివకుమార్ కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ చంద్రశేఖర్, వైదిక కమిటీ సభ్యుడు శంకర శాండిల్య, వేద పండితులు, పురోహితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ బీసీని సీఎం చేస్తామంటే బీసీలను అవమానిస్తావా?.

**–కేటీఆర్ షాడో సీఎం... సిరిసిల్లలో సామంత రాజుల పాలన:బండి సంజయ్**

సిరిసిల్ల నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బీజేపీ పార్టీలపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శలు గుప్పించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు అవినీతిపరులు బీజేపీ అధికారంలోకి వస్తే మచ్చలేని బీసీ నాయకుడు సీఎం అవుతారన్నారు సిరిసిల్లలో మాట్లాడుతూ కాంగ్రెస్, " కేటీఆర్... నిన్ను సీఎంగా ప్రకటించే దమ్ముందా వివా అయ్యకు. బీసీని సీఎం చేస్తామంటే గుణం ముఖ్యమని బీసీలను అవమానిస్తావా?. కేటీఆర్ షాడో సీఎం... సిరిసిల్లలో సామంత రాజుల పాలన. చినుకులు పడితే మునిగిపోయే సిరిసిల్ల. ఎంపీ ఎన్నికల్లో మాదిరిగా సిరిసిల్లలో సైలెంట్ ఓటింగ్ తథ్యం. రాణిరుద్రమ గెలుపు ఖాయం.'' అని బండి సంజయ్ అన్నారు.

# రూ.1.52కోట్లతో నిర్మించిన రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



అమరావతి, నవంబర్ 11:శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి నియోజకవర్గంనల్లచెరువు మండలం, బంద్రేపల్లి నుండి చెర్లోపల్లి రిజర్వాయర్ రోడ్డు వరకు రూ.1.42.00 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, బంద్రేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.10లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్లను కదిరి శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్దా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ? ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో మనం రూ. 1.52 కోట్ల రూపాయలతో 100 సంవత్సరాలు మన్నిక కలిగిన రోడ్లను నిర్మించుకున్నామన్నారు. దశాబ్దాల కాలం నుండి ఏమాత్రం అభివృద్ధికి నోచుకోనటువంటి దాదాపు 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లను నిర్మించామన్నారు.

పార్టీలకతీతంగా ప్రతి గ్రామానికి రహదారి నిర్మించి, అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఒకప్పుడు జబ్బు పడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే జోలెకట్టి మోసుకెళ్లే పరిస్థితి నుండి నేడు ప్రభుత్వం అందజేసే అత్యవసర సేవలైన 108 వాహనంలో ఇంటి వద్ద నుండే తరలించే స్థాయికి తీసుకొచ్చామన్నారు. అభివృద్ధి అంటే ఏంటన్నది జగన్మోహన్ రెడ్డిని చూసి నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, మండల కన్వీనర్లు, జె సి ఎస్ ఇన్చార్జులు, వివిధ శాఖల చైర్మన్ లు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సోషియల్ మీడియా ఇన్ చార్జీ సోదరులు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, సంబంధిత అధికారులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక మంత్రిత్వ శాఖ స్వచ్ఛత సంస్థాగతీకరణ మరియు కార్యాలయాల్లో పెండింగ్‌ను తగ్గించడంపై దృష్టి

న్యూఢిల్లీ, నవంబర్ 11:సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, దాని సంస్థలతో పాటు, ప్రత్యేక ప్రచారం 3.0లో ప్రధానంగా స్వచ్ఛతా సంస్థాగతీకరణ మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌ను తగ్గించడంపై దృష్టి సారించింది.



2023 అక్టోబర్ 2 నుండి 31 వరకు అమలు దశలో, అన్ని నియమించబడిన 449 సైట్‌లలో మరియు రికార్డ్ మేనేజ్‌మెంట్‌లో క్లీన్‌నెస్ డ్రైవ్‌లను నిర్వహించడంలో మంత్రిత్వ శాఖ 100% లక్ష్యాలను సాధించింది: మొత్తం 15,969 ఫిజికల్ ఫైల్‌లు మరియు 2133 ఈ–ఫైళ్లు సమీక్షించబడ్డాయి, వాటిలో 4975 ఫిజికల్ ఫైల్‌లు ఉ 1620 ఇ–ఫైళ్లు వరుసగా తొలగించబడ్డాయి మరియు మూసివేయబడ్డాయి. అదనంగా, నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా (ఎంఎ)కి బదిలీ చేయడానికి 138 భౌతిక ఫైళు కూడా గుర్తించబడ్డాయి. కండువాలు పారవేయడం ద్వారా రూ. 42, 15,715/– ఆదాయం సమకూరింది. మొత్తం 22272 చ.అ. ప్రాంతం విముక్తి పొందింది. అంతేకాకుండా, ఇతర విజయాలు 83% ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడం; 81.8% ఖటూ సూచనలు; 67.8% రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావనలు; 64.2% ఓఖ సూచనలు మరియు 51% పార్లమెంట్ హామీలు. మంత్రిత్వ శాఖ 8 పత్రికా ప్రకటనలను విడుదల చేసింది. ఇంకా, మంత్రిత్వ శాఖ మరియు దాని వివిధ సంస్థల ద్వారా 173 ట్వీట్లు కూడా చేయబడ్డాయి.

రికార్డుల పునరుద్ధరణ పరిరక్షణలో భాగంగా, NAI దాని సేకరణలో 21,425 షీట్‌లు, 140 ఫైల్‌లు మరియు 45 వాల్యూమ్‌ల రికార్డులను బైండింగ్ చేసింది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, బొగ్గు మంత్రిత్వ శాఖ మరియు డైరెక్టరేట్ జనరల్ అఖీఖఈ, న్యూఢిల్లీ వరుసగా 452, 572 మరియు 22 ఫైళ్లను మదింపు కోసం NAIకి తెలియజేసాయి. పబ్లిక్ రికార్డ్ యాక్ట్ & రూల్స్ నిబంధనల ప్రకారం NAI పైన పేర్కొన్న ఫైల్‌లను సంయుక్తంగా అంచనా వేయడానికి చర్యను ప్రారంభించింది.

ప్రత్యేక ప్రచారం 3.0 సమయంలో NAI రికార్డ్ మేనేజ్‌మెంట్‌లో కింది శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించింది:–

18వ తేదీ నుండి 20 అక్టోబర్, 2023 వరకు వివిధ మంత్రిత్వ శాఖలు/డిపార్ట్‌మెంట్‌లు, అనుబంధిత/సబార్డినేట్ కార్యాలయాలు మరియు PSUలు మొదలైన వాటి నుండి గ్రూప్ 'బి' & అంతకంటే ఎక్కువ మరియు తత్సమాన స్థాయి అధికారుల కోసం రికార్డ్ మేనేజ్‌మెంట్‌లో ఓరియంటేషన్ కోర్సు;

23.10.2023న మినిస్ట్రీ మరియు ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ASI)కి చెందిన గ్రూప్ 'A' & 'B' మరియు తత్సమాన స్థాయి అధికారుల కోసం రికార్డ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణా సెషన్.

వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాల ద్వారా కొత్తగా నామినేట్ చేయబడిన రికార్డ్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం. NAI రికార్డ్ సెంటర్, పుదుచ్చేరిలో 30 అక్టోబర్, 2023 & 1 నవంబర్, 2023లో భారతదేశం.

సాంస్కృతిక మంత్రిత్వ శాఖ "వేస్ట్ టు ఆర్ట్" – "స్క్రాప్ టు స్కల్ప్చర్" అనే అంశంపై 2023 అక్టోబర్ 28 నుండి 31వ తేదీ వరకు లలిత్ కళా అకాడమీ, 35 ఫిరోజ్‌షా రోడ్, మండి హౌస్, న్యూ ఢిల్లీలోని ఆఫీస్ ప్రాంగణంలో ఉత్తమమైన వాటిని ప్రదర్శించడానికి ఒక ప్రదర్శనను కూడా నిర్వహించింది. ప్రత్యేక ప్రచారం 3.0 సమయంలో వివిధ సంస్థలు చేసిన సృజనాత్మక పనులు. ఈ ప్రదర్శనను గౌరవనీయులైన సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘవాల్ జీ ప్రారంభించారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖలోని ఢిల్లీ ఆధారిత సంస్థలు మరియు నార్త్ ఈస్ట్ జోనల్ కల్చరల్ సెంటర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నాయి, ఢిల్లీ వెలుపల ఉన్న ఇతర సంస్థలు కూడా వారి సంబంధిత కార్యాలయాలలో ప్రదర్శనను నిర్వహించాయి.

# తెలంగాణ భవిష్యత్తు కామారెడ్డి ప్రజలు నిర్ణయించబోతున్నారు

**–గజ్వేల్‌ను భూములను ఖతం చేసాడు ..కామారెడ్డి భూములపై కేసీఆర్ కన్నుపడింది..**

**–కామారెడ్డి కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి**

కామారెడ్డి నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కామారెడ్డి కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ సభలో తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ భవిష్యత్తు కామారెడ్డి ప్రజలు నిర్ణయించబోతున్నారని తెలిపారు.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ కు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలు ఇచ్చే తీర్పు కోసం దేశం ఆసక్తిగా చూస్తోందన్నారు.''తెలంగాణ భవిష్యత్‌ను కామారెడ్డి ప్రజలు నిర్ణయించబోతున్నారు. బిఆర్ఎస్ కు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఇక్కడి ప్రజలు ఇచ్చే తీర్పు కోసం దేశం ఆసక్తిగా చూస్తోంది. గజ్వేల్ ప్రజలను కేసీఆర్ పదేళ్లపాటు మోసం చేశారు. కామారెడ్డి భూములపై కేసీఆర్ కన్నుపడింది.. అందుకే పోటీ చేస్తున్నారు." అని రేవంత్ రెడ్డి అన్నారు.''కేసీఆర్ మాది ఇదే ఊరని చెప్తున్నారు. కోనాపూర్‌లో నీ తల్లి గారి ఊరే అయితే ఆత్మహత్య చేసుకున్న రైతులను ఎందుకు ఆదుకోలేదు. కామారెడ్డిని బంగారు తునక చేస్తా అంటున్న నువ్వు గజ్వేల్‌లో ఏం చేసినవు. గజ్వేల్ ప్రజలు నీకు అండగా ఉంటే కామారెడ్డికి ఎందుకు వచ్చినవ్. కామారెడ్డిలో మాస్టర్ ప్లాన్‌తో భూములు కొల్లగొట్టడానికి వస్తున్నారు. షబ్బీర్ అలీ ఓడినా, గెలిచినా మీ వెంటే ఉన్నారు. గంప గోవర్ధన్ తన సీటు పోయిందని ఏడుస్తున్నారు. రెండుసార్లు సీఎం అయి లక్ష కోట్లు సంపాదించారు. ఆయన మనవడికి మంత్రి పదవి కోసం మరోసారి సీఎం అవుతాడట. కేసీఆర్‌ను బొంద పెట్టాలని కామారెడ్డిలో పోటీ చేస్తున్నా. షబ్బీర్ అలీ, ఏఐసీసీ ఆదేశాల మేరకు ఇక్కడ నామినేషన్ వేశాను. 40 మంది ఎమ్మెల్యేలను, 12 మంది ఎమ్మెల్సీలను, ఇద్దరు ఎంపీలను కొన్న కేసీఆర్ నాపై ఆరోపణలు చేస్తాడా. ఈ కొనుగోళ్లపై సీబీఐ విచారణకు సిద్ధంగా ఉన్నా.. నువ్వు సిద్ధమా?. సీబీఐ కి లేఖ రాయి.. లేకపోతే కామారెడ్డిలో ముక్కు నేలకు రాయి. కామారెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధి బాధ్యత నేను తీసుకుంటా." అని రేవంత్ రెడ్డి అన్నారు.

# నాగాలాండ్‌లోని గ్రీన్ మార్కెట్‌లు స్వచ్ఛ దీపావళిని జరుపుకుంటాయి

న్యూఢిల్లీ, నవంబర్ 11: MoHUA ద్వారా 'స్వచ్ఛ దీపావళి శుభ్ దీపావళి' ప్రచారాన్ని ప్రారంభించినప్పటి నుండి, ఇతర రాష్ట్రాల మాదిరిగానే నాగాలాండ్ కూడా ఈ సంవత్సరం పర్యావరణ అనుకూల దీపావళి గురించి అవగాహనను చురుకుగా ప్రోత్సహిస్తోంది. వ్యక్తిగత గృహాలకు అతీతంగా, దీపావళి సందర్భంగా పరిశుభ్రత యొక్క స్ఫూర్తి మొత్తం సమాజానికి విస్తరించింది, సమిష్టి కృషితో మార్కెట్‌లు మరియు వరినరాల్లో పరిశుభ్రతను నిర్ధారిస్తుంది, పండుగ వాతావరణాన్ని ప్రోత్సహిస్తుంది. దీనికి అనుగుణంగా, నాగాలాండ్‌లోని ట్యూన్‌సాంగ్ టౌన్ కౌన్సిల్ ఒక నవల చొరవను ప్రారంభించింది, అన్ని మార్కెట్ దుకాణదారులను వారి ప్రవేశాల దగ్గర వచ్చని మొక్కను ఉంచాలని నిర్దేశిస్తుంది, ఇది స్వచ్ఛమైన మరియు ఆకుపచ్చ దీపావళికి నిబద్ధతకు ప్రతీక. ఈ ఆలోచనాత్మక విధానం పర్యావరణ అవగాహనకు దోహదం చేయడమే కాకుండా స్థిరమైన మరియు సంతోషకరమైన పండుగ సీజన్ కోసం భాగస్వామ్య బాధ్యతను ప్రోత్సహిస్తుంది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడానికి ఒక సమిష్టి ప్రయత్నంలో, నాగాలాండ్ మార్కెట్లు 'బ్రింగ్ యువర్ ఓన్ బ్యాగ్' కాన్సెప్ట్‌ను విజయవంతం చేస్తున్నాయి. దీనికి నాయకత్వం వహిస్తూ, మాంగ్‌కోలెంబా టౌన్ కౌన్సిల్ దుకాణాలు పేపర్ బ్యాగ్‌లతో సహా ఎలాంటి క్యారీ బ్యాగ్‌లను అందించకుండా ఉండాలని ఆదేశించింది. బదులుగా, ప్రజలు చురుకుగా ప్రోత్సహించబడతారు మరియు షాపింగ్ చేసేటప్పుడు వారి స్వంత బ్యాగులను తీసుకురావాలని నిర్దేశిస్తారు. ఈ వ్యూహాత్మక చర్య ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం మరియు పర్యావరణ బాధ్యత యొక్క సంస్కృతిని పెంపొందించడం, రోజువారీ జీవితంలో స్థిరమైన అభ్యాసాలకు వ్యక్తిగత సహకారం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది పర్యావరణ అనుకూల అలవాట్లను పెంపొందించడానికి మరియు రిటైల్ కార్యకలాపాల యొక్క పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి సంఘం–ఆధారిత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

మెడ్జిఫెమా టౌన్ కౌన్సిల్ RRR – ప్రోత్సాహంతో' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ చొరవ ప్రజలను RRR సౌకర్యాన్ని ఉపయోగించుకునేలా ప్రోత్సహిస్తుంది, వ్యర్థాల విభజనను ప్రోత్సహిస్తుంది మరియు వ్యర్థాలను సంపదగా మార్చే భావనను ప్రోత్సహిస్తుంది. గరిష్ట భాగస్వామ్యాన్ని ఉత్పత్తి చేయడానికి, పట్టణం తమ వ్యర్థాలను నియమించబడిన కేంద్రాలకు తీసుకువచ్చే వారి కోసం కూపన్‌లను జారీ చేస్తోంది, మెడ్జిఫెమా టౌన్‌లోని వివిధ దుకాణాల నుండి మొక్కలు, ఐస్‌క్రీం, చాక్లెట్‌లు మరియు ఇతర వస్తువుల వంటి బహుమతులను అందిస్తోంది, తద్వారా సానుకూల పర్యావరణ పద్ధతులను బలోపేతం చేస్తుంది. నాగాలాండ్‌లోని దిమాపూర్ మునిసిపల్ కౌన్సిల్ మరియు చుముకెడిమా టౌన్ కౌన్సిల్ రిలయన్స్ ట్రెండ్స్‌తో కలిసి ఈ ప్రాంతంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సఫాయిమిత్రలకు బహుమతి కూపన్‌లను అందించాయి.

# ఆజాద్ 136వ జయంతి వేడుకలు

అమరావతి, నవంబర్ 11:స్వాతంత్ర సమరయోధుడు భారతరత్న డా. జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జన్మదిన వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఇందులో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, వైకాపా నాయకులు పరికి సాదిక్ భాషా,వివిధ ముస్లిం మైనార్టీ సంఘాలకు చెందిన ప్రతినిధులు నాయకులు తదితరులున్నారు.

# 'సమగ్ర డిజిటల్ ప్రకటనల విధానం 2023' ని ఆమోదించిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, నవంబర్ 11:'సమగ్ర డిజిటల్ ప్రకటనల విధానం 2023' కి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. 'సమగ్ర డిజిటల్ ప్రకటనల విధానం 2023' వల్ల కేంద్ర ప్రభుత్వ ప్రకటనల విభాగం అయిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కి విస్తరిస్తున్న డిజిటల్ మీడియా రంగంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి అధికారం లభిస్తుంది. ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తున్న వివిధ పథకాలు,విధానాలకు సంబంధించిన సమాచారానికి విస్తరిస్తున్న డిజిటల్ మీడియా రంగంలో విస్తృత ప్రచారం కల్పించి, వివిధ రంగాలకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కు అవకాశం లభిస్తుంది.

అభివృద్ధి చెందుతున్న డిజిటల్ మీడియా రంగం పెద్ద సంఖ్యలో వీక్షకులను కలిగివుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పనిచేస్తున్న డిజిటల్ మీడియా రంగంలో తక్కువ ఖర్చుతో ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలు, విధానాలను గుర్తించిన వర్గాలకు సమర్ధంగా చేరడానికి వివిధ విధానాలు అందుబాటులో ఉంటాయి. ఇటీవల కాలంలో డిజిటల్ మీడియా రంగాన్ని వినియోగిన్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ ఇండియా కార్యక్రమానికి ఇంటర్నెట్, సోషల్, డిజిటల్ మీడియా వినియోగిస్తున్న ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. 2023 జనవరి-మార్చి కాలానికి సమందించి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో ఇంటర్నెట్ వ్యాప్తి 880 మిలియన్లకు పైగా ఉంది. 2023 మార్చి నాటికి టెలికాం చందాదారుల సంఖ్య 1172 మిలియన్లకు పైగా ఉంది.

నూతన విధానం ప్రకారం ఓటీటీ, వీడియో ఆన్ డిమాండ్ స్పేస్ వ్యవస్థలో ఏజెన్సీలు, సంస్థలను ఎంప్యానెల్ చేయడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారం లభిన్తుంది. డిజిటల్ ఆడియో ప్లాట్‌ఫారమ్‌ల ఎంపానెల్‌మెంట్ ద్వారా పాడ్‌క్యాస్ట్‌లు, డిజిటల్ ఆడియో ప్లాట్‌ఫారమ్‌లకు పెరుగుతున్న శ్రోతలను కూడా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కారక్రమాలు చేరుతాయి. నూతన విధానం ద్వారా ఇంటర్నెట్ వెబ్‌సైట్‌లను ఎంప్యానెల్ చేసే ప్రక్రియను హేతుబద్ధీకరించడానికి, మొదటిసారిగా మొబైల్ అప్లికేషన్‌ల ద్వారా ప్రజలకు సంబంధించిన ప్రచార సందేశాలను ప్రసారం చేయడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కు అధికారం లభిస్తుంది. ప్రజల మధ్య సమాచార వ్యాప్తి చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర గణనీయంగా పెరిగింది. నూతన విధానం వల్ల సామాజిక మాధ్యమాల్లో కూడా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కు ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసే అధికారం లభిస్తుంది. వివిధ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఎక్కువ మందికి చేరేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కు అవకాశం కల్పించడంతో పాటు డిజిటల్ మీడియా ఏజెన్సీలను ఎంప్యానెల్ చేయడానికి నూతన విధానం అధికారం ఇస్తుంది.

విస్తరిస్తున్న డిజిటల్ మీడియా రంగం ప్రాధాన్యత గుర్తించిన నూతన విధానం చట్టబద్ధంగా ఏర్పాటయ్యే కమిటీ ఆమోదంతో డిజిటల్ మీడియా రంగంలో నూతన ఒరవడి సృష్టించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కు అవకాశం కల్పిస్తుంది. పారదర్శక విధానంలో అమలు అయ్యే విధంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ, 2023 రూపొందింది. పారదర్శకత, సామర్థ్యాలకు ప్రాధాన్యత ఇస్తూ రేటు నిర్ధారణ కోసం పోటీ బిడ్డింగ్ విధానం అమలు అవుతుంది.

ఈ ప్రక్రియ ద్వారా నిర్ధారించిన రేట్లు మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటులో ఉంటాయి. అన్ని అర్హత కలిగిన ఏజెన్సీలకు రేట్లు వర్తిస్తాయి.

ప్రస్తుత డిజిటల్ యుగంలో అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/ విభాగాలు ప్రత్యేక సోషల్ మీడియా హ్యాండిల్‌లను కలిగి ఉన్నాయి. వీటి ద్వారా ప్రసారం అవుతున్న ఇన్ఫోగ్రాఫిక్స్, వీడియోలు హ్యాండిల్ చందాదారులకే పరిమితంఅవుతున్నాయి. నూతన విధానం వల్ల ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు , విభాగాల ప్రచార కార్యక్రమాల విస్తృతి పెరుగుతుంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా యూనిట్ అయిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ప్రకటనలు విడుదల చేస్తుంది. సంబంధిత వర్గ;లతో విస్తృత్వ స్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరిపిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ 2023ని రూపొందించింది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలు, ప్రజా సంక్షేమ విధానాల వివరాలు ఎక్కువ మంది ప్రజలకు చేరుతాయి.

కేంద్ర సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, విధానాల గురించి అవగాహన కల్పించడం , సమాచారాన్ని వ్యాప్తి చేయడం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మీడియా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పనితీరు మార్చుకుంటున్న సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఎక్కువ మంది ప్రజలకు కార్యక్రమాలు అందుబాటులోకి తెచ్చేందుకు ఆధునిక సాంకేతికతలను అమలు చేయడానికి చర్యలు అమలు చేస్తోంది.

# మద్యం లారీ బోల్తా.. బాటిళ్ల కోసం ఎగబడ్డ మందుబాబులు

అమరావతి, నవంబర్ 11:విశాఖపట్నం జిల్లా మధురవాడ కొమ్మది వద్ద ఉచిత మద్యం కోసం జనాలు ఎగబడ్డారు. ఫ్రీగా వస్తే ఫినాయిల్ కూడా మనోళ్లు వదలరు అన్నట్లుగా వ్యవహరించారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖ జిల్లా మధురవాడ కొమ్మది వద్ద మద్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న లిక్కర్ బాక్సులు మొత్తం రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయాయి. లారీ అలా బోల్తా కొట్టిందో లేదో మందుబాబులు అలా పట్టేశారు.

ఆ సమయంలో అటుగా వెళుతున్న వాహనదారులు మద్యం బాక్సులను చూసి వెంటనే తమ వాహనాలను ఆపారు. రోడ్డుపై పడిన మద్యం బాటిళ్లను అందిన కాడికి ఎత్తుకెళ్లారు. ఇలాంటి బంపర్ ఆఫర్ మళ్లీ రాదని భావించి బాటిళ్లకు బాటిళ్లు పట్టుకెళ్లారు. రోడ్డుపై పడ్డ మద్యం బాటిళ్లను అందినకాడికి అందినట్టు పట్టుకొని స్థానికులు వెళ్లిపోయారు. కొందరైతే పెట్టెలను కూడా ఎత్తుకెళ్తూ కనిపించారు. అయితే లారీలో ఉన్న డ్రైవర్ సంగతి ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగే సమయానికి రోడ్డుపై బాటిల్స్ పెంకులు తప్ప ఏమీ కనిపించలేదు. పోలీసులు స్థానికులను నిలువరించి పరిస్థితిని అదుపు చేశారు.

# విజయవంతమైన స్వచ్ఛత ప్రత్యేక 3.0 ప్రచారం

న్యూఢిల్లీ, నవంబర్ 11:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం నుండి స్ఫూర్తి పొంది, నైపుణ్యాభివృద్ధి ఒ వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రచార 3.0ని 2023 అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 వరకు ప్రారంభించింది. ఈ ప్రచారం యొక్క ప్రాథమిక లక్ష్యాలు పెండింగ్‌లో ఉన్న విషయాలను త్వరితగతిన పరిష్కరించడం, సమర్థవంతమైన స్థలం చుట్టూ కేంద్రీకృతమై ఉన్నాయి. నిర్వహణ, మరియు పరిశుభ్రమైన మరియు పచ్చటి పర్యావరణం యొక్క ప్రచారం.

స్వచ్ఛతపై ప్రత్యేక ప్రచారం 3.0 విజయవంతంగా ముగియడం మంత్రిత్వ శాఖ నిబద్ధతకు నిదర్శనం. ఈ సమగ్ర చొరవ మంత్రిత్వ శాఖ అంతటా విస్తరించింది, అలాగే దాని అనుబంధ/సబార్డినేట్ కార్యాలయాలు మరియు స్వయంప్రతిపత్త సంస్థలు దేశంలోని వివిధ ప్రాంతాలలో విస్తరించాయి. సెప్టెంబర్ 15, 2023 నుండి ప్రారంభమయ్యే సన్నాహక దశ, ప్రచార కాలంలో శుభ్రపరచడానికి నిర్దిష్ట లక్ష్యాలను గుర్తించడంలో కీలక పాత్ర పోషించింది.

ప్రచారం పెండింగ్‌లో ఉన్న విషయాలను పారవేసేందుకు మాత్రమే కాకుండా, స్థల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడానికి మరియు కార్యాలయాలలో మొత్తం కార్యాలయ అనుభవాన్ని పెంపొందించడానికి ప్రత్యేక శ్రద్ధను ఇచ్చింది. సన్నాహక దశ మరియు ప్రచారం అంతటా, దేశవ్యాప్తంగా 8354 పరిశుభ్రత ప్రదేశాలను నిశితంగా గుర్తించారు. దాదాపు 660 చదరపు అడుగుల స్థలాన్ని క్లియర్ చేయడం, 4579కి పైగా ఫిజికల్ ఫైల్‌లు క్షుణ్ణంగా సమీక్ష కోసం కేటాయించడం ఊహించిన ఫలితం. అలాగే, స్క్రాప్ పారవేయడం ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ. 20,94,013/- . రోజువారీ పురోగతిని ప్రత్యేక బృందం శ్రద్ధగా పర్యవేక్షిస్తుంది మరియు అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ డిపార్ట్‌మెంట్ హోస్ట్ చేసిన SCPDM పోర్టల్‌లో స్థిరంగా నవీకరించబడింది.

ఇంకా, స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అతుల్ కుమార్ తివారీ, ప్రత్యేక ప్రచారం 3.0 సమయంలో సాధించిన పురోగతిని అంచనా వేయడానికి వివిధ విభాగాలను సందర్శించడం మరియు క్రమం తప్పకుండా సమీక్ష సమావేశాలను నిర్వహించడం ద్వారా చురుకైన చర్యలు తీసుకున్నారు. అతని తెలివైన మార్గదర్శకత్వంతో, ప్రచారంలో భాగంగా ప్రాంతీయ సంస్థలను సందర్శించడానికి ప్రత్యేక బృందాలు వ్యూహాత్మకంగా నిర్వహించబడ్డాయి, దాని ప్రభావవంతమైన అమలు మరియు ప్రభావాన్ని నిర్ధారించాయి. "స్వచ్ఛమైన మరియు మరింత సమర్థవంతమైన పాలన కోసం ప్రధాని మోదీ దృష్టిలో, ప్రత్యేక ప్రచారం 3.0 శ్రేష్ఠతకు మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. వ్యూహాత్మక ప్రణాళిక, ఆకస్మిక పర్యటనలు మరియు అంకితభావంతో కూడిన జట్టుకృషి ద్వారా, మేము స్థలాన్ని ఖాళీ చేయడమే కాకుండా పరిశుభ్రత కారణాన్ని కూడా ముందుకు తీసుకెళ్లాము. మరియు సమర్థత, పరివర్తనాత్మక మార్పు కోసం మా సంకల్పానికి ఈ చొరవ నిదర్శనం, స్వచ్ఛత మరియు కార్యాచరణ శ్రేష్ఠత యొక్క ఆదర్శాలకు అనుగుణంగా పనిచేసే ప్రదేశాన్ని పెంపొందించడం" అని స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అతుల్ కుమార్ తివారీ అన్నారు.

బెంగుళూరులోని హోసూర్ రోడ్‌లోని ప్రభుత్వ మోడల్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో 25 వైవిధ్యమైన ప్రదేశాలలో కృత్రిమ రీఛార్జ్ పిట్‌లను నిర్మించడం MSDEచే గుర్తించబడిన మెచ్చుకోదగిన పద్ధతుల్లో హైలైట్ చేయబడింది. ఈ గుంటలు దాదాపు 12 మిలియన్ లీటర్ల వర్షపు నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి, ఇది వార్షిక వర్షపాతంలో దాదాపు 10%కి సమానం. ఈ ప్రయత్నం ITI పరిధిలో 25 పెర్కోలేషన్ బావుల స్థాపనకు దారి తీస్తుంది, ఇది దాదాపు 3.2 మిలియన్ లీటర్ల వర్షపు నీటిని సంరక్షించగలదు, తద్వారా స్థిరమైన నీటి నిర్వహణ కార్యక్రమాలకు గణనీయమైన సహకారం అందించబడుతుంది.

అక్టోబర్ 1న, ప్రభుత్వ ITI బెహ్రాంపూర్, ఒడిశా కూడా ఒక వినూత్నమైన మరియు స్థిరమైన ఆలోచనతో స్వచ్ఛతా అభియాన్‌ను గుర్తించింది. 23 అడుగుల ఎత్తైన స్క్రాప్ ఏనుగు నిర్మాణాన్ని ఆవిష్కరించడంతో వేడుక సృజనాత్మకంగా మరియు పర్యావరణ స్పృహతో మలుపు తిరిగింది. 30,000 ఉపయోగించిన ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను ఉపయోగించి ఈ ప్రత్యేకమైన ఇన్‌స్టాలేషన్ రూపొందించబడింది, 3000 మంది బెహ్రాంపూర్ ట్రైనీలు ఈ బాటిళ్లను నగరంలోని వివిధ ప్రదేశాల నుండి శ్రద్ధగా సేకరించారు. ఈ చొరవ పరిశుభ్రత పట్ల నిబద్ధతను ప్రదర్శించడమే కాకుండా దృశ్యపరంగా ప్రభావవంతమైన మరియు పర్యావరణ అనుకూలమైన వేడుక కోసం పదార్థాలను రీసైక్లింగ్ చేయడానికి మరియు పునర్నిర్మించడానికి ఒక వినూత్న విధానాన్ని ప్రదర్శించింది.

# గాలా ప్రీమియర్స్ 54వ IFFI 2023లో సెంటర్ స్టేజ్‌ను తీసుకుంటాయి

న్యూఢిల్లీ, నవంబర్ 11:2023 నవంబర్ 20 నుండి 28 వరకు గోవాలోని 54వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో బ్లాక్ బస్టర్‌లు మరియు వెబ్ సిరీస్‌ల కోలాహలం వేచి ఉంది.

54వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఎఈఈఎ) కోసం, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "గాలా ప్రీమియర్స్" యొక్క రెండవ ఎడిషన్‌ను ప్రదర్శించడం పట్ల థ్రిల్‌గా ఉంది. ఈ సెగ్మెంట్ చలనచిత్ర తారలను ప్రేక్షకులతో కనెక్ట్ చేయడానికి, ప్రపంచవ్యాప్తంగా సినిమా కళాత్మ కతను జరుపుకోవడానికి మరియు అసాధారణమైన చిత్రాలను ముందుకు తీసుకురావడానికి, పండుగ యొక్క ప్రధాన నైతికతను నిలబెట్టడానికి ఖచ్చితంగా రూపొందించబడింది.

ఏ.ఆర్. సంగీతం అందించిన సల్మాన్ ఖాన్, అరవింద్ స్వామి, విజయ్ సేతుపతి మరియు అదితి రావ్ హైదరీ నటించిన గాంధీ టాక్స్ (నిశ్శబ్దం) యువ ప్రతిభను కలిగి ఉండి, యువ ప్రతిభను కలిగి ఉన్న ఫీచర్ ఫిల్మ్‌లు ఫారే (హిందీ) యొక్క ప్రపంచ ప్రీమియర్‌లు. రెహమాన్, పంకజ్ త్రిపాఠి మరియు పార్వతి తిరువోతు నటించిన కడక్ సింగ్ (హిందీ), సిద్ధార్థ్ రంధేరియా నటించిన హర్రీ ఓం హర్రీ (గుజరాతీ), నవాజుద్దీన్ సిద్ధిఖీ నటించిన రౌతు కి బెలి (హిందీ), విజయ్ రాఘవేంద్ర నటించిన గ్రే గేమ్స్ (కన్నడ), డి విజయ్ రాఘవేంద్ర నటించిన రెండు సిరీస్‌లు నాగ చైతన్య నటించిన (తెలుగు) పార్వతి తిరువోతు మరియు ఆర్య నటించిన ది విలేజ్ (తమిళం), అక్షయ్ ఒబెరాయ్ మరియు ఊర్వశి రౌతేలా నటించిన దిల్ హై గ్రే (హిందీ), మరియు టార్సెమ్ సింగ్ రూపొందించిన డియర్ జస్సీ (పంజాబీ) ఆసియా ప్రీమియర్‌లు ఇక్కడ జరగనున్నాయి. IFFI.

ఏ వతన్ మేరే వతన్ చిత్రం కరణ్ జోహార్ మరియు సారా అలీ ఖాన్ మధ్య సంభాషణతో ప్రత్యేక ప్రదర్శనను కలిగి ఉంటుంది.

అనురాగ్ ఠాకూర్, గౌరవనీయ సమాచార & ప్రసార మంత్రి, ఉ నీలబి. భారతదేశం యొక్క 'సల్మాన్ ఖాన్ నిర్మించిన 'ఫారీ' యొక్క గౌరవనీయమైన చిత్రనిర్మాతలు మరియు ప్రతిభావంతులైన నటులకు నేను హృదయపూర్వక మరియు దయతో స్వాగతం పలుకుతున్నాను; అరవింద్ స్వామి మరియు విజయ్ సేతుపతితో జిఇజ నిర్మించిన 'గాంధీ టాక్స్'; పంకజ్ త్రిపాఠి నటించిన 'కడక్ సింగ్'; నాగ చైతన్య మరియు పార్వతి తిరువోతుతో అమెజాన్ ఒరిజినల్ సిరీస్ 'ధూత'; మరియు ఆర్య మరియు దివ్య పిళ్లై నటించిన 'ది విలేజ్', ఏఆర్ రెహమాన్ మరియు ఊర్వశి రౌతేలాతో సహా ఇతర ప్రముఖ కళాకారులలో నటించారు. ప్రఖ్యాత టార్సెమ్ సింగ్ ఉనికి ఈ సినిమా కోలాహలానికి శ్రేష్ఠతను జోడించింది. గాలా ప్రీమియర్ మా తాజా ప్రచారం 'మేరి మిట్టి మేరా దేశ్'తో ఉత్తరం, తూర్పు, దక్షిణం మరియు పశ్చిమ ప్రాంతాల నుండి సినిమాని జరుపుకుంటుంది. మేమిద్దరం కలిసి గోవాలో సినిమా మాయాజాలాన్ని అత్యుత్తమంగా జరుపుకుంటాం!

MD NFDC &ఫెస్టివల్ డైరెక్టర్ మిస్టర్ పృథుల్ కుమార్ మాట్లాడుతూ, "ప్రపంచ వ్యాప్తంగా సినిమా కళను జరుపుకోవడానికి మేము IFFI.వద్ద సమావేశమైనప్పుడు, సినిమా అనేది సరిహద్దులు మరియు సంస్కృతులకు అతీతమైన సార్వత్రిక భాష అని మేము గుర్తు చేస్తున్నాము. గాలా ప్రీమియర్ సెగ్మెంట్ కథా శక్తికి నిదర్శనం, మరియు ప్రేక్షకులను ప్రేరేపించే మరియు కదిలించే ఈ ఆకర్షణీయమైన చిత్రాలను ప్రదర్శించడం మాకు గౌరవంగా ఉంది. వెండితెర మాయాజాలం కథాకథనాల ఆనందంలో మనల్ని ఏకం చేద్దాం" అన్నారు.

సౌమేంద్ర పాధి దర్శకత్వం వహించిన "ఫారీ", ఒక ఉత్కంఠభరితమైన ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుంది, అయితే కిషోర్ పదురంగ్ బెలేకర్ రచించిన "గాంధీ టాక్స్" పెట్టుబడిదారీ విధానం, జాత్యహంకారం మరియు సమాజం యొక్క లోతులను విస్తృతంగా అన్వేషించే సామాజిక వ్యాఖ్యానంలోకి ప్రవేశిన్తుంది, చమత్కారమైన సూచనలతో హిందూ పురాణాలు మరియు 'సముద్ర మంథన్' కథ.

అనిరుద్ధ రాయ్ చౌదరి దర్శకత్వం వహించిన "కడక్ సింగ్" చిత్రం ఆర్థిక నేరాల శాఖ అధికారి ఎకె శ్రీవాస్తవ, రెట్రోగ్రేడ్ మతిమరుపుతో బాధపడుతున్న కథను అనుసరించింది. అతని పరిస్థితి ఉన్నప్పటికీ, అతను చిట్ ఫండ్ స్కామ్ యొక్క సంక్లిష్ట కేసును అతను ఎవరో మరియు అతను ఆసుపత్రిలో ఎలా చేరాడు అనే విభిన్న దృక్కోణాలను వినడం ద్వారా పరిష్కరించాడు. మిలింద్ రావ్ దర్శకత్వం వహించిన "ది విలేజ్" ప్రేక్షకులను రోడ్ ట్రిప్‌లో తీసుకువెళుతుంది, ఇది ఒక కుటుంబం మార్పుచెందగలవారి వంశానికి బలి అయినప్పుడు చెడుగా మారుతుంది.

"త్వరగా ఓం త్వరపడండి," "డియర్ జస్సీ," "రౌతు కి బెలి," "ధూత," "దిల్ హై గ్రే," మరియు "గ్రే గేమ్స్"తో సహా అనేక ఇతర విశేషమైన చిత్రాలతో, 54వ IFFI లోని గాలా ప్రీమియర్స్ విభాగం అందిస్తుంది వైవిధ్యమైన మరియు ఆకర్షణీయమైన సినిమా అనుభవం, ఇది అవగాహనలను సవాలు చేస్తుంది, మానవ భావోద్వేగాలను అన్వేషిస్తుంది మరియు సస్పెన్స్ మరియు మిస్టరీ యొక్క రంగాన్ని పరిశోధిస్తుంది.

54వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా ( IFFI.) ప్రపంచంలోని అత్యుత్తమ సినిమాలను ప్రదర్శించే అత్యంత ముఖ్యమైన చలన చిత్రోత్సవాలలో ఒకటి. ఈ ఉత్సవం స్థాపించబడిన మరియు వర్ధమాన చిత్రనిర్మాతలు తమ అసాధారణమైన పనిని ప్రపంచ ప్రేక్షకులతో పంచుకోవడానికి ఒక వేదికను అందిస్తుంది. చలనచిత్రాలు మరియు ఈవెంట్‌ల యొక్క విభిన్న ఎంపికతో, ఎఈఈఎ సినిమా కళను జరుపుకోవడానికి మరియు సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంది. డైరెక్ట్ OTT సిరీస్ మరియు విడుదల కాని సినిమాలు పండుగ ప్రేక్షకుల కోసం తమ కంటెంట్‌ను ప్రీమియర్ చేయడానికి ఉత్సాహంగా ఉన్నాయి. సమోదిత ప్రేక్షకులు ఎవరైనా ముందు వీటిని చూడాలనే ఉత్సాహం IFFI ఈసారి మళ్లీ అందించనుంది.

# కరెంటు కోతల వల్ల నాడు రైతులకు అనేక కష్టాలు.. మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, నవంబర్ 11:కరెంటు కోతల వల్ల నాడు రైతులు అనేక కష్టాలు పడ్డారని, వేళాపాళా లేని కరెంటుతో పాముకాట్లకు గురై వందలాది మంది రైతులు మరణించారని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ రూరల్ మండలంలోని చర్ల భుత్కూర్, తాహెర్ కొండాపూర్ గ్రామాలలో మంత్రి ప్రచారం నిర్వహించారు.

గ్రామాలకు వచ్చిన మంత్రి గంగుల మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలుకగా, డప్పు చప్పుళ్ళ మధ్య బీ ఆర్ ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి తాను చేసిన అభివృద్ధిని వివరించి మరోసారి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ..హైదరాబాద్ రాష్ట్రం సంపాదను దోచుకునేందుకు? నాటి పాలకులు ధనిక రాష్ట్రాన్ని బలవంతంగా ఆంధ్ర లో కలిపాం ని..సమైక్య పాలనలో మన బొగ్గును? దోచుకుని?గోదావరి జలాలను తరలించుకున్నారనీ..సాగు నీరు? కరెంట్ లేక అరిగోస పడ్డ రోజులు ఉండేవని గుర్తు చేశారు. కరెంట్ సమయానికి రాక పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన రైతులు ఎందరో అని ఆవేదన వ్యక్తంచేశారు. స్వయం పాలనలో సమస్యలు పరిష్కరించామని, కాళేశ్వరం జలాలతో తాగు సాగు నీటిని పరిష్కరించి మండుటెండల్లో చెరువులను మత్తడి దూకిస్తున్నామని అన్నారు.సియం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలతో కరెంట్ కష్టాలు లేకుండా పోయాయని, పుష్కలమైన నీటితో భూమికి బరువయ్యే పంటలు పండిస్తూ రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. పచ్చని తెలంగాణను చూస్తే ఆంధ్రోళ్ళకు కంటగింపుగా ఉందని, మళ్ళీ తెలంగాణ పై విషం చిమ్ముతున్నారని..సినిమా స్టూడియోలు చూపించి? హైదరాబాద్ మా సంపద అంటున్నారని అన్నారు. తెలంగాణ వ్యతిరేకులైన మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డి,షర్మిల, కెవిపిలు బిజెపి కాంగ్రెస్ ముసుగులో హైదరాబాదులో అడ్డావేశారని, తెలంగాణలో చిచ్చు పెట్టమని పవన్ కళ్యాణ్ ను చంద్రబాబు పంపించారని అన్నారు. వీరంతా కలిసి కెసిఆర్ ను ఓడగొట్టేందుక గుడుపుతాని చేస్తున్నారని, కెసిఆర్ ను ఓడించి తెలంగాణ ను ఆంధ్రాలో కలిపి గుడ్డిదీపం చేస్తారని అన్నారు. మన తాతలు తప్పు చేస్తే 50 సంవత్సరాలు దరిద్రాన్ని చూశామని మనం తప్పు చేస్తే మన భవిష్యత్ తరాలు గోస పడుతాయనీ ..తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టొద్దని పిలుపునిచ్చారు.ఎన్నికల వేళ మరోసారి ఆశీర్వదించాలని కాంగ్రెస్ బిజెపి నాయకులు వస్తున్నారనీ?వారు ఎన్నికలప్పుడే కనిపించి మాయమవుతారని అన్నారు. భూకబ్జా కేసులున్న రౌడీ షీటర్ కు కాంగ్రెస్ టికెట్ ఇచ్చిందని..ఆయనను గెలిస్తే మన భూములను కబ్జా చేస్తారని అన్నారు. ఎంపిగా గెలిచిన తర్వాత బండి సంజయ్ ఎప్పుడైనా కనిపించాడా అని అన్నారు. కెసిఆర్ సిఎంగా లేని తెలంగాణ ఊహించుకోలేమని భయంకరంగా ఉంటుందనీ, కుక్కలు చింపిన విస్తరి చేస్తారు అని అన్నారు. తెలంగాణను దోపిడీ చేసేందుకు శత్రువులు రెడీగా ఉన్నారని కర్ణాటక ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ దని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ను నమ్మొద్దని అక్కడి ప్రజలు చెబుతున్నారని..వారికి ఓటు వేసి గెలిపిస్తే గోస తప్పదని ఓటు వేసే ముందు ఆలోచించాలని కోరారు. యాభై ఏళ్ల దరిద్రానికి కారణమైన కాంగ్రెస్ బిజెపిల పట్ల తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. సాగు నీరు, కరెంట్ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, మరోసారి తనను గెలిపిస్తే మరింత గొప్పగా పని చేస్తానని అన్నారు.

# ఎన్నికల ప్రచారంలో వాహన ర్యాలీలు లేకుండా చూడాలి

-ప్రచారం పేరుతో కాలుష్యం పెంచుతున్నారు
-వాహన ర్యాలీలపై నియంత్రణ పాటించాలి.
-ఎన్నికల సంఘం పర్యవేక్షణ ముమ్మరం చేయాలి.
-రాజకీయ పార్టీలకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వినతి

హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); గెలుపు ఆరాటంలో వందల వాహనాలతో కాలుష్యాలు పోగుపెడుతున్నారని, తక్షణమే వాహన ర్యాలీలకు బ్రేక్ వేయాలని "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ '' అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. శనివారం కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య బాగ్ లింగం పల్లి కౌన్సిల్ కార్యాలయంలో మాట్లాడుతూ.. .. వ్యవస్థ సంక్షేమానికి పాటు పడాల్సిన రాజకీయరంగం ఎన్నికల పేరుతో ధ్వంస రచనకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నాయకులు వారి మెహర్బానీ కోసం ప్రచారంలో నిబంధనలకు మించి, పర్యావరణానికి విఘాతం జరుగుతున్నా ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యాల కారణంగా మొన్నటి కరోనా విపత్తు సృష్టించిన నష్టం మరిచిపోరాదని ఆయన పార్టీలకు గుర్తు చేశారు. ప్రతి రాజకీయ పార్టీ విజ్ఞత పాటించి ప్రచారంలో వాహన శ్రేణి లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం కూడా మరింత నిఘా పెంచి తన వంతు పాత్ర నిర్వర్తించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

# సిసి టీవీ కెమెరాల నిఘా, వెబ్కాస్టింగ్ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి

- జిల్లా ఎన్నికల అధికారి /కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 10:(నేటనిజం ప్రతినిధి):సాధారణ ఎన్నికలు 2023, ఎన్నికల నియమావళి లో బాగంగా కేంద్ర ఎన్నికల సంఘం నిబందల మేరకు ఎన్నికలు సీసీ టీవీ, కెమెరాల, నిఘా పర్యవేక్షణలో జరపాలని జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో వెబ్ క్యాస్టింగ్,సీసీ టీవీ కెమెరాల, ప్రతినిధులతో మాట్లాడారు, సీసీ టీవీ కెమెరాల,వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించారు .వెబ్ కేటగిరీ లు విభజన ,సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల గుర్తింపు,పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని,త్రాగు నీరు, మౌలిక సదుపాయాలు కల్పించలని, ఔఅఆ వాలంటీర్స్ ని ఓటింగ్ పక్రియ లో వినియోగించుకోవాలని , వారికి ఒక రోజు ట్రైనింగ్ ఇవ్వాలని , కౌంటింగ్ హాల్ , స్ట్రాంగ్ రూం ల లో పక్బం దీగా నిఘా పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు రమేష్, వేంకటేశ్వర్లు సాయిబాబా, సందిప్, రాజిరెడ్డి, ఎన్నికల సిబ్బంది, పాల్గొన్నారు.

# మద్యం లారీ బోల్తా.. బాటిళ్ల కోసం ఎగబడ్డ మందుబాబులు



విశాఖపట్నం, నవంబర్ 11: మధురవాడ కొమ్మది వద్ద ఉచిత మద్యం కోసం జనాలు ఎగబడ్డారు. ఫ్రీగా వస్తే ఫినాయిల్ కూడా మనోళు వదలరు అన్నట్లుగా వ్యవహరించారు. వివరాల్లోకి వెళ్తే.. విశాఖ జిల్లా మధురవాడ కొమ్మది వద్ద మద్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న లిక్కర్ బాక్సులు మొత్తం రోడ్డుపై చెల్లా చెదురుగా ప డిపోయాయి. లారీ అలా బోల్తా కొట్టిందో లేదో మందుబాబులు అలా పట్టేశా రు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వాహనదారులు మద్యం బాక్సులను చూసి వెంటనే తమ వాహనాలను ఆపారు. రోడ్డుపై పడిన మద్యం బాటి ళ్లను అందిన కాడికి ఎత్తుకెళ్లారు. ఇలాంటి బంపర్ ఆఫర్ మళ్లీ రాదని భావించి బాటిళ్లకు బాటిళ్లు పట్టుకెళ్లారు. రోడ్డుపై పడ్డ మద్యం బాటిళ్లను అందినకాడికి అందినట్టు పట్టుకొని స్థానికులు వెళ్లిపోయారు. కొందరైతే పెట్టెలను కూడా ఎత్తుకెళ్తూ కనిపించారు. అయితే లారీలో ఉన్న డ్రైవర్ సంగతి ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కాగా సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగే సమయానికి రోడ్డుపై బాటిల్స్ పెంకులు తప్ప ఏమీ కనిపించలేదు. పోలీసులు స్థానికులను నిలువరించి పరిస్థితిని అదుపు చేశారు.

# న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా విస్తృత రక్షణ & వ్యూహాత్మక అంశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 11:రక్షా మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నవంబర్ 10, 2023న న్యూ ఢిల్లీలో జూ డిఫెన్స్ సెక్రటరీ మిస్టర్ లాయిడ్ ఆస్టిన్‌తో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు.

ఇద్దరు మంత్రులు విస్తృతమైన రక్షణ మరియు వ్యూహాత్మక అంశాలపై సమగ్రంగా చర్చించారు. డిఫెన్స్ పారిశ్రామిక సహకారాన్ని పెంపొందించడం మరియు రక్షణ వ్యవస్థలను సహ-అభివృద్ధి చేయడానికి మరియు సహ-ఉత్పత్తి చేయడానికి రెండు వైపుల నుండి రక్షణ పరిశ్రమలను పొందడంపై ప్రత్యేక దృష్టి ఉంది.

కీలకమైన ప్రాంతాల్లో ఉమ్మడి పరిశోధనలతో తమ రక్షణ సాంకేతిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రులు మార్గాలు మరియు మార్గాలను అన్వేషించారు. ఈ సంవత్సరం జూన్‌లో ప్రారంభించబడిన భారతదేశం-యుఎస్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్, INDUS-X పురోగతిని వారు సమీక్షించారు మరియు భారతదేశం మరియు యుఎస్ ప్రభుత్వాలు, వ్యాపారాలు మరియు విద్యాసంస్థల మధ్య వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యం మరియు రక్షణ పారిశ్రామిక సహకారాన్ని విస్తరించడం లక్ష్యంగా చేసుకున్నారు.

బహ్రెయిన్‌లో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న బహుళ పక్ష నిర్మాణమైన కంబైన్డ్ మారిటైమ్ ఫోర్సెస్‌లో పూర్తి సభ్యత్వానికి ఎలివేట్ చేయాలనే భారతదేశ నిర్ణయాన్ని సెక్రటరీ ఆస్టిన్ స్వాగతించారు.

యుఎస్ డిఫెన్స్ POW MIA అకౌంటింగ్ ఏజెన్సీ మిషన్‌లో భాగంగా అస్సాంలో స్వాధీనం చేసుకున్న కొన్ని వస్తువులను రక్షా మంత్రి ప్రతీకాత్మకంగా సెక్రటరీ ఆస్టిన్‌కి అందజేశారు. ఈ వస్తువులలో పారాచూట్ భాగాలు, యూనిఫాం మరియు రెండవ ప్రపంచ యుద్ధ కాలం నాటి జూ దళాలు ఉన్నాయి. మంత్రులు, ముగింపుకు ముందు, వారి బృందాల కోసం భవిష్యత్తులో ఉమ్మడి పని కోసం ఒక ఎజెండాను రూపొందించారు.

# డబ్బులు పంచే బీఆర్ఎస్‌ను, కాసులకు అమ్ముడుపోయే కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించండి- బండి సంజయ్



చొప్పదండి, నవంబర్ 11: కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఏమాత్రం ఇమేజ్ లేదని, బీఆర్ఎస్‌ను ఓడగొట్టేది బీజేపీయే అన్నారు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్. ఇందుకు గత ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పెంచేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు డబ్బులు పంచుతున్న కేసీఆర్‌ను, కాసులకు అమ్ముడుపోయే కాంగ్రెస్‌ను? ఇద్దరినీ ఓడించాలన్నారు.చొప్పదండిలో బొడిగె శోభ తరఫున ఆయన ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ ఉప ఎన్నికలు వస్తాయని సంజయ్ హెచ్చరించారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్, కవిత, హరీశ్ రావు, సంతోష్ కుమార్? వీళ్లంతా ముఖ్యమంత్రి కావాలని పోటీ పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌లోను అదే పరిస్థితి ఉందన్నారు. అందరూ ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడతారని ఎద్దేవా చేశారు. చొప్పదండిలో బొడిగె శోభను గెలిపించకుంటే మీరంతా ఓవైసీ తమ్ముళ్లు అవుతారని అన్నారు. ధరణి తప్పుల తడక అని కేసీఆరే చెప్పారని, కేసీఆర్ అఫిడవిట్ ప్రకారం ఆయన భూరికార్డుల్లో ఓ గుంట భూమి ఎక్కువగా ఉందన్నారు. బిజెపిలో ముఖ్యమంత్రి ఎవరనేది పార్టీ పెద్దలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు.. అయితే బీసీ ముఖ్యమంత్రి కావడం మాత్రం తథ్యమన్నారు.

# గల్ఫ్ మృతుడి కుటుంబానికి డాక్టర్ గోలి మోహన్ పరామర్శ

## -మృతదేహం స్వగ్రామానికి చేరుస్తానని భరోసా



వేములవాడ, నవంబర్ 11, నేటి మనదేశం: వేములవాడ నియోజకవర్గం చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన రావుల బాబు కువైట్ దేశంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని గోలి మోహన్ శనివారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాబు మృతదేహం స్వగ్రామానికి రప్పించడానికి బాధిత కుటుంబసభ్యులు బిఎస్పి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోలి మోహన్ ను కోరారు. స్పందించిన డాక్టర్ గోలి మోహన్ బాబు మృతదేహం స్వగ్రామానికి రావడానికి కృషి చేస్తానని బాధిత కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. సానుకూలంగా స్పందించిన గోలి మోహన్ కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# లింగంపల్లిలో బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్ ఇంటింటా ప్రచారం




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గంలో కోనరావుపేట్ మండలం లింగంపల్లి గ్రామంలో శనివారం బిఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోలి మోహన్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల పార్టీ బీఎస్పీ అని, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గెలిచిన వెంటనే అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున లింగంపల్లి మహిళలు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

# మరొకసారి అవకాశం ఇవ్వండి -నియోజకవర్గాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తా- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11:మరొకసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ,ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శనివారం లింగోజిగూడా డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు చే కలిసి సరూర్ నగర్ ప్రియదర్శిని పార్క్ నందు వాకర్స్ ను కలవడం జరిగింది.ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు సుధీర్ రెడ్డి కి సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరుగుతు ందని హామీ ఇచ్చారు.ప్రస్తుతం పార్క్ యొక్క స్వరూపం పూర్తిగా మారింది అని తెలిపారు.వచ్చే ఎన్నికల్లో మా యొక్క మద్దతు ఉంటుంది అని హామీ ఇచ్చారు.అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రియదర్శిని పార్క్ 2007 వ సంవత్సరంలో ప్రారంభించడం జరిగింది అని గుర్తు చేశారు.అంతకు ముందు ఇట్టి పార్క్ పూర్తిగా బురదమయంగా ఉండేది అని తెలిపారు.నేను రెండవ సారి ఎమ్మెల్యేగా అయినప్పటికీ తరువాత నియోజకవర్గ పరిధిలో పార్కుల అభివృద్ధి విషయంలో పార్కుల యొక్క స్వరూపం మార్చడం జరిగింది అని తెలిపారు. ప్రియదర్శిని పార్క్ నందు ప్రస్తుతం పూర్తి స్వరూపం మార్చడం జరిగింది అని గుర్తు చేశారు. పర్యాటకులు పార్కుకు రావడానికి ఇట్టి పార్క్ ప్రవేశ ద్వారం నందు ఒక అందమైన నెమలి ఆకారం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పర్యాటకులు కూర్చోవడానికి గజీబులు ,ఓపెన్ జిమ్స్,యోగ చేసుకోవడానికి యోగ సెంటర్,అత్యాధునిక మూత్రశాలలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.పార్క్ నందు మొక్కలు ఎండకుండా మరొక బోరు కూడా వేయించడం జరిగింది అని తెలిపారు.నియోజకవర్గ పరిధిలోని అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్స్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సరూర్ నగర్ చెరువును రాబోయే రోజుల్లో సుందరికారణ చేసి అందులో చిన్న చిన్న పడవలతో బోటింగ్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరుగుతుందని అని తెలిపారు.

మరొక్కమారు నాకు అవకాశం ఇవ్వండినియోజకవర్గన్నీ అభివృద్ధి విషయంలో నెంబర్ వన్ గా నిలబెట్టడం జరుగుతుంది అని తెలిపారు.కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి మీ యొక్క సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోయిని మహేందర్ యాదవ్,రవి,భాస్కర్ గంగపుత్ర,తిలక్,నత్యం,జై శంకర్,అశోక్ మరియు పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

# సవాల్‌కు సై..స్థలం ఎక్కడో నిర్ణయించి చెప్తే.. సింగిల్ గానే వస్తా




నిజామాబాద్, నవంబర్ 11:నిజామాబాద్ అర్బన్ బీఆర్ ఎస్ అభ్యర్థి గణేష్ గుప్త విసి రిన సవాల్ కు సై? అని ఈ నెల 13న ఉదయం 10 గంట లకు బహిరంగ చర్చకు సిద్ధ మని అభ్యర్థి ధన్పాల్ సూర్య నారాయణ తెలిపారు. స్థలం ఎక్కడో నిర్ణయించి చెప్తే.. సింగిల్ గా వస్తానని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ని మొత్తం కబ్జాలు, కమిషన్లు, అవినీతి, దౌర్జన్యాలు, మాఫి యాకు అడ్డాగా మార్చాడని విమర్శించారు. గణేష్ గుప్త కబ్జాల గురిం చి మాట్లాడితే దయ్యాలు వేదా లు వల్లించి నట్లు ఉందన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని ప్రగతి నగర్లో గల బీజేపీ జిల్లా పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేక ర్ల సమావేశంలో ధన్ పాల్ మాట్లాడారు. గణేష్ గుప్తకు ఓటమి భయం పట్టుకుందని,. నామినేషన్ ర్యాలీని చూసి దిమ్మతిరిగి సోయి తప్పి మాట్లా డుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రజలు పాలనలో మార్పు కోరుతు న్నారు? స్వచ్ఛందంగా బిజెపి అభ్యర్థులకు భారీ ఎత్తున ప్రజలు మద్దతు ఉన్నారని బిజెపి అర్బన్ అభ్యర్థి ధన్పాల్ సూర్య నారాయణ అన్నారు. మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత కొన్ని సంవత్సరాల క్రితం ట్రస్టుని ఏర్పాటు చేసి తొమ్మిది సంవత్సరాలుగా నిజాంబాద్ అర్బన్ ప్రజలకు సేవలు అందిస్తున్నానని పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాదు నగరం లోని 21వ డివిజన్ లోనీ ఎల్లమ్మ గుట్ట లో బిజెపి అభ్యర్థి దన్ పాల్ సూర్యనారాయణ ప్రచారం నిర్వహిం చారు.

ఈ సందర్భంగా దంపాల్ మాట్లాడుతూ నగర ప్రజలంతా కమలం పువ్వు కు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం లో మోదీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల మనునును గెలుచు కుందన్నారు. అన్ని పార్టీ లకు అవకాశం ఇచ్చారు ఒక్క సారి బిజెపి కి అవకాశం ఇవ్వాలని కోరారు. నా ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవ కార్యక్రమాలు చేశానని చెప్పారు. నా ట్రస్ట్ ద్వారా కుల మతాల కు అతీతంగా సేవ కార్యక్రమాలు చేశానని అన్నా రు. నిజామబాద్ అర్బన్ ప్రజలు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి అని కోరారు.

ఈ కార్యక్రమం లో 21 వ డివిజన్ ఇంచార్జి దొంతుల రవి, 20 వ డివిజన్ కార్పొ రేటర్ న్యాలం రాజు, పంచారెడ్డి లావణ్య లింగం, పంచారెడ్డి ప్రవళిక, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి,బిజెపి మోర్చా అధ్యక్షులు శివ ప్రసాద్, మైనార్టీ అధ్యక్షులు కైసార్, డివిజన్ నాయకులు, బిట్టు, రాజేందర్ పాల్గొన్నారు

# ఇంటింటికీ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో

## -అభ్యర్థి కాలేరు వెంకటేశ్ ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగియడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్ తన ప్రచార పర్వాన్ని ముమ్మరం చేశా రు. ఇప్పటికే అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట, బాగ్ అంబర్ పేట, గోల్నాక, నల్లకుంట, కాచిగూడ డివిజన్లలోని పలు ప్రాంతాలను సగం చుట్టేసి ప్రచారంలో ముందున్న కాలేరు వెంకటేశ్ శుక్రవారం అంబర్ పేట డివిజన్ లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

న్యూపటేల్ నగ ర్ బుజిలి మహంకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో పాటు వందలాది మంది పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, గత ఐదేండ్లుగా తాను చేసిన అభివృద్ధి పనులతో పాటు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు అడుగడుగునా మహిళలు మంగళ హారతులతో ఘనం స్వాగతం పలుకుతూ తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు లవంగు ఆంజనేయులు, ఎర్రబోలు నరసింహారెడ్డి, మోర శ్రీరాములు తదితరులు ఉన్నారు.

# నిజామాబాద్‌లో చెల్లని రూపాయి ఎల్బీనగర్‌లో చెల్లుతుందా

## -కాంగ్రెస్, బీజేపీ నాయకులకు బుద్ధి చెప్పాలి

## -ఇంటింటికీ ప్రచారంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11: నిజామాబాద్‌లో చెల్లని రూపాయి హైదరాబాద్‌లో చెల్లుతుందా అని, నిజామాబాద్ ప్రజలు తరిమికొడితే ఇక్కడికి వచ్చి పడ్డ కాంగ్రెస్ నాయకుడిని ప్రజలు ఆదరించరని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం చైతన్యపురి డివిజన్‌లోని మున్సిపల్ కాలనీ, ఇందిరానగర్‌తో పాటుగా పరిసర కాలనీల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నీరాజనాలు పలికారు. స్థానిక నాయకులు ప్రచారంలో భాగంగా సుధీర్‌రెడ్డిపై పూలవర్షం కురిపించారు.

మహిళలు హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకడంతో పాటుగా బీఆర్ఎస్‌కే మద్దతు ఇస్తామంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో దొంగలకు, కబ్జాకోరులకు, మోసకారులకు స్థానం లేదన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంపై అవగాహన కూడాలేని కొత్త మోహాలు వస్తున్నాయని, వారికి స్థానం లేకుండా చేయాలన్నారు.

ఎల్బీనగర్ ని యోకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని పోతున్నానని, అభివృద్ధిని చూసి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ దొంగ డాక్యుమెంట్లు, దొంగ వీసాలతో విద్యార్థులను మోసం చేశాడని 420 కేసులు ఉన్నాయంటూ గోనె ప్రకాశ్‌రావు ఆరోపణలు చేశాడని, అదే రీతిలో బీజేపీ నాయకుడికి కూడా పలు మోసాల్లో చోటు ఉందని, సొంత కుటుంబ సభ్యులను కూడా మోసం చేశాడన్నారు.

# కారు జోరుతో ప్రతిపక్షాలు బేజారు.. దాసరి ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11: నియోజకవర్గంలో కారు జోరుకు ప్రతిపక్ష పార్టీలు బేజార్ అవుతుయన్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తనయుడు దాసరి ప్రశాంత్ రెడ్డి తెలియజేశారు. శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.

అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ దొంగ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, సంక్షేమమైనా, అభివృద్ధి చేయడమైనా బీఆర్ఎస్ తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని పథకాలను తెలంగాణలో ఎలా అమలు చేస్తారన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే తెల్ల రేషన్ కార్డు గల ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందడంతో పాటు 5 లక్షల రూపాయల బీమా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. సౌభాగ్య లక్ష్మీ పథకం ద్వారా ప్రతి మహిళకు 3000 అందుతాయని, ఆసరా పింఛన్లను ఐదువేలకు పెంచుతామని, వికలాంగుల పింఛన్లను ఆరువేల రూపాయలకు పెంచుతామన్నారు.

గ్యాస్ సిలిండర్ ను 400 రూపాయలకే అందిస్తామని, రైతు బంధును 16 వేల రూపాయలకు పెంచుతామన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేస్తే మూడు గంటలు కరెంటు వస్తుందని, కారు గుర్తుకు ఓటేస్తే మూడు పంటలు పండుతాయన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గులాబీ జెండా రెపరెపలాడేలా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి, ఎంపీపీ సంపత్, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బి.యన్ రెడ్డి నగర్‌లో మార్నింగ్ వాక్ విత్ మధుయాష్కీ

హైదరాబాద్, నవంబర్ 11:బి.యన్ రెడ్డి నగర్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మధు యాష్కీ గౌడ్ శనివారం ఉదయం స్వామి వివేకానంద పార్క్ లో మార్నింగ్ వాక్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాలనీ వాసులతో, అడుగులో అడుగేస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ నడక కొనసాగించారు.మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ, మాది పీపుల్స్ మేనిఫెస్టో, మీ సమస్యలను మా మేనిఫెస్టోలో పెడతాం. మీ సమస్యలను పరిష్కరించడమే నా యొక్క లక్ష్యం అన్నారు. సమయాభావం వల్ల ఎన్నికల ముందు ప్రతి ఇంటికి నేను రాలేకపోవచ్చు. రేపు మీ ఎమ్మెల్యేగా ప్రతి ఇంటికి వచ్చి మీ కాలనీ సమస్యలు అధికారుల సమక్షంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మన ఆరోగ్యం కాపాడుకోవడం ఎంత ముఖ్యమో ఈ గంజాయి బ్యాచ్ నాయకుల బారి నుండి మన ఎల్బీనగర్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం, మనందరం కలిసి భాధ్యతగా ఎల్బీనగర్ ను లిక్కర్ ఫ్రీ, గంజా ఫ్రీ, కబ్జా ఫ్రీ,కరప్షన్ ఫ్రీ, కమిషన్ ఫ్రీ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందాం అన్నారు.

# కాంగ్రెస్ అధిష్టానానికి గాడిదకు, గుర్రానికి తేడా తెలియదు : పాల్వాయి స్రవంతి




హైదరాబాద్, నవంబర్ 11: 'ఊహ తెలిసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాను. నాటి విలువలు నేడు లేవు. ప్రస్తుతం దానిని బ్రోకర్ల పార్టీగా మార్చివేశారు' అంటూ కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జి పాల్వాయి స్రవంతి ఆరోపించారు. 'ఒక గాడిదను గుర్రం అనుకొని తీసుకు వచ్చారు. కాని ఏదో ఒకరు ఆ గాడిదను గుర్తిస్తే తిరిగి వెనక్కి తన్నక తప్పదని కాంగ్రెస్ అధిష్టానం పై తీవ్ర విమర్శలు చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీరును, అధిష్టానం వైఖరిని ఆమె తప్పుబట్టారు.

తన తండ్రి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి అరవై సంవత్సరాల పాటు కాంగ్రెస్‌లోనే కొనసాగారని, ప్రత్యేక రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొని అనేక త్యాగాలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌ను కాపాడేందుకు ఎన్నో అవమానాలకు గురై తుది శ్వాస వరకు ఆ పార్టీలోనే సేవలందించారన్నారు. తన తండ్రిని చూసి రాజకీయ ఓనమాలు దిద్దుకున్నానని, కాలక్రమేణా పార్టీలో విలువలు తగ్గిపోయాయని విమర్శించారు.

జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పారాచూట్ నాయకులకు తావు లేదని ప్రకటించి 50 మందికిపైగా పారాచూట్‌లకే టికెట్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, సీనియర్లకు స్థానం లేకుండా చేశారని వాపోయారు. కాంగ్రెస్ విలువలతో కూడిన పార్టీ అని అనుకున్నానని, కాని ఆ పార్టీని నిలువెత్తున బేరానికి పెట్టి ఎవరెక్కువ పైసలు ఇస్తే వారికే ప్రాధాన్యతనిచ్చే దుస్థితికి దిగజారిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరకముందే సర్వేలో వారి పేర్లు వస్తాయని, ఏండ్ల తరబడి జెండాలను మోసిన వారు కనిపించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ చచ్చిపోయిందని చెప్పిన వ్యక్తులకు కండువాలు కప్పుతున్నారని, వారికి 24 గంటల్లోనే టికెట్లు కూడా ఇచ్చేస్తున్నారని వెల్లడించారు. ఇటీవల కాంగ్రెస్ కోమటి రెడ్డి బ్రదర్స్ బ్రాండ్ అని చెప్పుకొని తిరుగుతుంటే తన కండ్లు బైర్లు కమ్మాయని, పార్టీని పాతాళానికి తొక్కేసే అలాంటి వారి చర్యలను అధిష్టానం గుర్తిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులు చూసిన తర్వాత ఆ పార్టీపై ఉన్న కనీస గౌరవం పోకూడదనే పార్టీ నుంచి తప్పుకుంటున్నానని వెల్లడించారు.

కొందరు బ్రోకర్లు వచ్చి పార్టీని పాతాళానికి తొక్కివేశారని, ఇది కలలో కూడా ఊహించలేదన్నారు. తన రాజీనామా లేఖను ఇప్పటికే సోనియా గాంధీకి పంపించానన్నారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేండ్లుగా బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే ప్రజలకు మంచి చేస్తుందని, అనేక పథకాలు ప్రవేశపెట్టి వారికి సంక్షేమానికి పాటుపడుతున్నదన్నారు. త్వరలోనే అనుచరవర్గం, తన వెన్నంటి వచ్చే కార్యకర్తల సలహా మేరకు నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం..

## జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్- అధ్యక్షులు రత్నారెడ్డి



హైదరాబాద్, నవంబర్ 11:రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఎన్నేపల్లి మూడో వార్డులో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగులపల్లి రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు జై వెంకట్ రెడ్డి నేతృత్వంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నారెడ్డి మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానం సాధించి విజయం సాధిస్తుందని వికారాబాద్ జిల్లాలో నాలుగు స్థానాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ భారీ మెజార్టీతో వికారాబాద్లో విజయం సాధించడం తధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివానంద్, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు సర్ఫరాజ్, నాయకులు భూపాల్ రెడ్డి నారాయణ, వేనక శ్రీనివాస్ ముదిరాజ్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రముగ్ధులను చేసిన అరవింద్ ఆంపుల ఫ్యాషన్ షో

హైదరాబాద్ నవంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ ఆంపుల ఆధ్వర్యంలో వరేణ్యం 23' పేరుతో వీకా ఫ్యాషన్ షో.. నగరం యొక్క గొప్ప వారసత్వాన్ని ప్రతిబింబించే సాంప్రదాయ హైదరాబాదీ సంస్కృతి తో మంత్రముగ్ధులను చేసింది. మొఘల్ వాస్తుశిల్పం యొక్క కలెక్షన్స్ తోఈ దీపావళి కొత్త డిజైన్ కలెక్షన్స్ తో ప్రఖ్యాత డిజైనర్లు అరవింద్ అంబుల, సాక్షి భాటి, గసగసాల సాల్ట్ మరియు ఆకాష్ రాజ్‌పుత్ డిజైనర్స్ అద్భుతమైన కలెక్షన్స్ తో అత్యంత అద్భుతమైన రీతిలో ఫ్యాషన్ షో ప్రదర్శించారు. అరవింద్ అంబుల నిర్వహించిన్న దీపావళి న్యూ డిజైన్ కలెక్షన్స్ లో మోడల్స్ వావ్ అనిపించారు. ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ ఆంపులా మరో అద్భుతమైన కలెక్షన్స్ వీకా సాంప్రదాయ మరియు ఆధునిక దుస్తులు కలయిక. మా తాజా సేకరణ విలాసవంతమైన మరియు ప్రత్యేకమైన మరియు వినూత్నమైన మార్గాన్ని అందిస్తుంది. లేబుల్ సిల్హౌట్, డిజైన్, కలర్ కాంబినేషన్‌లు మరియు స్టైలింగ్ పరంగా భారతీయ దుస్తులు యొక్క సాంప్రదాయ సొబగులను బ్యాలెన్స్ చేయడం మరియు ఆవిష్కరించడం ద్వారా క్లాసిక్, ప్రత్యేకమైన మరియు టైమ్‌లెస్ ఫ్యాషన్ దుస్తులను సృష్టించే చక్కటి కళను జరుపుకుంటుంది. తాజా సేకరణలు సహజంగా రంగులు వేసిన మరియు చేతితో నేసిన వస్త్రాలపై చక్కగా అలంకరించబడిన క్లిష్టమైన చేతి ఎంబ్రాయిడరీని కూడా వర్ణిస్తాయి. వరుణ్ చక్కిలం, తన ఉత్కంఠభరితమైన వధువు మరియు ఫ్యూజన్ దుస్తులకు ప్రసిద్ధి చెందిన ప్రఖ్యాత డిజైనర్.

# బిఆర్ఎస్ ఇంటింటా ప్రచారం



మహబూబాబాద్, నవంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలో పాలకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్ద వంగర ఎక్స్ రోడ్ వద్ద 12వార్డులో పాలకుర్తి దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఎర్రబెల్లి గోపాల్ రావు ,మండల బి ఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్ స్థానిక ఎంపీటీసీ ఏదునూరి శ్రీనివాస్ ,పిఎసిఎస్ డైరెక్టర్ అనపురం రవి ,గ్రామ పార్టీ అధ్యక్షులు బోనగిరి లింగమూర్తి ,మండల ఎస్సి సెల్ అధ్యక్షులు చిలుక బిక్షపతి, శ్రీరామ్ రాము,నిమ్మల శ్రీనివాస్, ధర్మారపు సుమలతయాకయ్య, చెరుకు యాకయ్య , చిలుక రజిత, రాయిపెల్లి మదార్, అనపురం యాకయ్య,రాంపాక నారాయణ అనపురం చంద్రమౌళి, చిలుక సిద్దు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# దీపావళి - దివ్య చరితావళి

**"దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం సర్వ తమోపహమ్**
**దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమోస్తుతే**
**దీపారాధన : దీప లక్ష్మీ ర్నమోస్తుతే" దీపం ప్రాణానికి ప్రతీక.**

## పండుగ ప్రస్తావన :

దీపావళి పండుగ వచ్చిందంటే పుర విధులన్నీ దీపకాంతులతో అలరారుతూ ఇంటిల్లిపాది ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకునే పండుగ దీపావళి. తిమిరంతో సమరం సాగించే పండుగ గా మిరుమిట్లు గొలిపే వెలుగు పూల వింత కాంతులు విరజిమ్ముతుంటే పిల్లలకేరింతలు ఈ పండుగ విశేషం. ఈ పండుగ సందర్భంగా వెలిగించే బాణాసంచా పట్ల పిల్లలు పెద్దలు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీపావళి పండుగకు హిందూ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. దీపావళి రోజున వెలిగించే దీపాలలో సకల దేవతలు దీపంలో నిక్షిప్తమై ఉంటారని, తద్వారా సకల కార్యాలు సఫలీకృతం అవుతాయని పండితులంటారు. కార్తీకమాసంలో నిత్యం దీపాలను వెలిగించడం హిందువుల సాంప్రదాయం కాగా ప్రతి ఒక్కరు భక్తి తో వెలిగించిన దీపాలలో జ్ఞానానికి సంపదకు శాంతికి ప్రతీకగా భావిస్తారు. దీపాన్ని వెలిగించడం చేపట్టబోయే కార్యక్రమాలకు, దీపం సాక్షిగా చుట్టూ వెలుగు కిరణాలు ప్రసరించి జరపబోవు ఏ కార్యక్రమ మైనా అద్వితేమైనా ఆధ్యాత్మిక భావనను నింపుతూ మనసును రంజింప చేస్తుంది. దివ్య దీపావళికి శ్రీ మహాలక్ష్మిని, మరుసటి రోజు నుండి ప్రారంభమయ్యే కార్తీకమాసంలో పరమేశ్వరుడైన శ్రీ మహా శివుని పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం. కార్తీక మాసంలో వెలిగించే దీపాలకు విశేష ఫలితాలు ఉంటాయంటారు కృత్తికా నక్షత్ర ప్రాధాన్యం ఉన్న కార్తిక మాసం అగ్ని ఆరాధనకు ముఖ్యమైంది అగ్నికి సూక్ష్మ రూపమే దీపం. ప్రత్యక్ష దైవాల్లో ఒక్కడైన అగ్నిని దీప రూపంలో ఆరాధించడం అంటే పరోక్షంగా ఆ పరబ్రహ్మానికి కృతజ్ఞతలు చెప్పడమే కాదు తద్వారా సమస్త మానవాళికి పుణ్యఫలం దక్కుతుందని హిందువుల విశ్వాసం.

## నరకచతుర్దశి:

ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరకచతుర్దశిగా ప్రసిద్ధి పొందింది. నరకాసురుడనే రాక్షసుడు చెలరేగి సాధు జనాలను పీడిస్తూ దేవ, మర్త్య లోకాలలో సంక్షోభాన్ని కలిగిస్తుంటాడు. కృతయుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామికి, భూదేవికి అసుర సంధ్యా సమయంలో జన్మిస్తాడు నరకుడు. అతడు లోక కంటకుడైనా మహావిష్ణువు వధించరాదని, తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానునిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది. అప్పటికి నరకాసురుడు లోక కంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలి వెళ్తాడు శ్రీకృష్ణుడు. వారి మధ్యజరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరకచతుర్దశిగా పిలువబడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు, ఢచ39;పదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డారు, ధర్మం సుప్రతిష్ఠమైంది. నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమావాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది. దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. ఈ దీపావళి శరదృతువులో అరుదెంచటం విశేషం. పైగా దీపాలపండుగ అయిన దీపావళి రోజున మహాలక్ష్మీ పూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. పూర్వం దుర్వాస మహర్షి ఒకమారు దేవేంద్రుని ఆతిథ్యానికి సంతసించి, ఒక మహిమాన్వితమైన హారాన్ని ప్రసాదించాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావముతో తన వద్దనున్న ఐరావతం అను ఏనుగు మెడలో వేస్తాడు అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది. అది చూచిన దుర్వాస మహర్షి ఆగ్రహము చెంది దేవేంద్రుని శపిస్తాడు. తత్ఫలితంగా దేవేంద్రుడు రాజ్యమును కోల్పోయి, సర్వసంపదలు పోగొట్టుకుని దిక్కుతోచక శ్రీహరిని ప్రార్థిస్తాడు. ఈ పరిస్థితిని గమనించిన శ్రీమహావిష్ణువు దేవేంద్రుని ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీమహాలక్ష్మీ స్వరూపంగా తలచి పూజించమని సూచిస్తాడు. దానికి తృప్తిచెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సర్వసంపదలను పొందాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ సమయంలో శ్రీమహావిష్ణువు చెంతనే ఉండే మహాలక్ష్మీదేవిని ఇంద్రుడు ఇలా ప్రశ్నించాడు. తల్లి నీవు కేవలం శ్రీహరి వద్దనే ఉండటం న్యాయమా? నీ భక్తులను కరుణించవా? అంటాడు. దీనికి ఆ మాత సమాధానమిస్తూ. త్రిలోకాధిపతీ. "నన్ను త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు వారివారి అభీష్టాలకు అనుగుణంగా మహర్షులకు మోక్షలక్ష్మీ రూపంగా, విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మిగా, విద్యార్థులు నన్ను ఆరాధిస్తే విద్యాలక్ష్మిగా, ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించేవారికి ధనలక్ష్మిగా, వారి సమస్త కోరికలు నెరవేర్చే వరలక్ష్మీదేవిగా ప్రసన్నురాలౌ తానని" సమాధానమిచ్చింది. అందుచేత దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించేవారికి సర్వసంపదలు చేకూరుతాయని విశ్వాసం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది.

## దీపావళిపండుగ వైశిష్ట్యం:

దీపావళి పండుగకు పురాణ ప్రాముఖ్యమే కాకుండా, చారిత్రక ప్రాధాన్యత కూడా ఉంది.




ఈ పండుగలో అంతర్లీనంగా అనేక కర్తవ్యాలు గోచరిస్తాయి. వాటిలోని అంతస్సూత్రం మాత్రం ఒక్కటే అదే మానవత్వం.

ఆబాలగోపాలాన్నీ అలరించే ఈ పండుగ కేవలం మనదేశంలోనే కాకుండా వివిధ దేశాలలోనూ జరుపుకుంటారు. ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాలలో వివిధ రకాలుగా దీపావళి పండుగ జరుపుకుంటారు. ఇక తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాలలో జరుపుకునే పండుగ దాదాపు ఒకేలా ఉంటుంది. గుజరాత్ రాష్ట్రంలో దీపావళి నుండి నూతన సంవత్సర ఆరంభమౌతుంది. రకరకాల పిండివంటలతో లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతారు. మహారాష్ట్రలో లక్ష్మీపూజ, గణేషపూజ వైభవంగా జరుపుకుంటారు. దీపావళి రోజు లక్ష్మీదేవి తమ ఇళ్ళలోకి వస్తుందని ఉత్తర భారతీయుల నమ్మకం. ఇదే ఆచారంగా తెలుగు రాష్ట్రాలలో ఉన్న వ్యాపార సంస్థలు అన్నికూడా, వెండి, బంగారు నగలు అమ్మేదుకాణాదారులు, బట్టలు, చీరలు అమ్మే వ్యాపారులు ఒకరిని మించి ఒకరు దుకాణాలను రంగురంగుల బంతి, చామంతిపూలతో, దేదీప్యమానమైన దీపకాంతులతో అలంకరణ చేసి, లక్ష్మీపూజను నిర్వహించి, మిఠాయిలు పంచడం, అనంతరం బాణాసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తున్న ఆచారంగా చెప్పవచ్చు.

పశ్చిమబెంగాల్, ఒరిస్సాలోని తూర్పు ప్రాంతంవారు దీపావళి రోజున కాళీపూజను ఘనంగా జరుపుతారు. పంజాబ్లో లో దీపావళి తర్వాత రోజును ఢచ39;టిన్నోఢచ39;గా వ్యవహరిస్తారు. రాజస్తాన్లో దీపావళి "హీడ్" పూజచేస్తారు. హీడ్ అంటే మట్టితో చేసిన చిన్న కుంపటిలాంటిది. అందులో చిన్నచితుకులు వేసి మంట రాజేస్తారు. ముగ్గులతో సుందరంగా అలంకరించి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమం నిర్వహిస్తారు. తమిళనాడులో తెల్లవారుజామున లేచి నరకచతుర్దశి జరుపుతారు. ఎంత పేదవారయినా సరే ఆడపిల్లలను పుట్టింటికి పిలిచి సత్కరిస్తారు. దక్షిణ భారత దేశంలో మూడురోజులపాటు "దీపావళి" జరుగుతుంది. మొదటి రోజు "నరక చతుర్దశి", రెండవరోజు దీపావళి అమావాస్యగా ప్రతి ఇంటిలోనూ లక్ష్మీపూజ చేసి, ఇంటి ప్రాంగణం నలువైపులా రకరకాల రంగుల్లో ఉన్న మట్టిప్రమిదలతో దీపాలంకరణ చేసి బాణాసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తుంటారు.

నేటి ప్రపంచీకరణ నేపధ్యం హిందూవులు ఈ ఆచార సంప్రదాయాలను ఒక్క భారతదేశానికే పరిమితం కాకుండా, వివిధ దేశాలలోనూ ఈ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకుంటారు. పొరుగుదేశాలైన బర్మా, మలేషియా, చైనా, నేపాల్, శ్రీలంక, జావా, బలి, సుమిత్రా ద్వీపవాసులు, మలేషియా, థాయ్లాండు, కాంబోడియా, వియాత్నం, ఇండోనేషియా, మారిషస్ దేశాలలో కూడా ఆయాదేశాల ఆచారవ్యవహారాలకు లోబడి దీపావళి పండుగ జరుపుకుంటారు. దీపావళి పండుగ జరుపుకునేందుకు సిద్ధపడే మందు పిల్లాపాపలంతా అప్రమత్తంగా ఉండవలసిన అవసరము ఆవశ్యకత ఎంతైనా ఉంది అయితే పర్యావరణానికి హాని కలగని రీతిలో ఉండవలసిన అవసరం కూడా ఎంతైనా ఉంది.

## వాయుకాలుష్యం:

ఈ పండుగ సందర్భంగా వెలిగించే టపాసులు, మతాబులు, కాకరపువ్వోత్తులు, చిచ్చుబుడ్లు, ఇలా అనేక రకాలైన వాటికి సీసం, రాగి, మెగ్నీషియం, జింక్స్, మాంగనీస్, సోడియం, పొటాషియం, బేరియం, అల్యూమినియం, కాడ్మియం, పాస్ఫరస్ వంటి పదార్థాలను ఉపయోగిస్తారు. దానివల్ల త్వరితముగా మానవాళికి దగ్గు, జ్వరం, వణుకు, కండరాల బలహీనత, దురదలు, ఎముకలు పెళుసుబారడం, గుండె, మెదడు, లివర్, కిడ్నీలకు ప్రమాదకారి అని డాక్టర్లు తరచు హెచ్చరిస్తూనే ఉంటారు. ఇంకా పెద్దలు ఏమరపాటుగా ఉంటే పిల్లలు కొని తెచ్చె ప్రమాదాలు అన్నీ, ఇన్నీ కావనే చెప్పవచ్చు. వాతావరణం వాయుకాలుష్య బారినపడటం తథ్యం. బాణాసంచా కాలుస్తున్నప్పుడు విరజిమ్మే వాయుకాలుష్యం (కోవిడ్-19) తో ఇబ్బందిపడుతున్న రోగులకు శ్వాసను పీల్చుకోవడంలో మరింత ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కొనే అవకాశం ఉండవచ్చు. ఈ పొగవలన చంటి పిల్లలు, వృద్ధులు ఇబ్బందిపడతారు.

## శబ్దకాలుష్యం:

బాణాసంచా ద్వారా వచ్చే శబ్దాలకు ఏవిధమైన రుగ్మతతో మంచానికి అతుక్కుని ఉన్న వృద్ధులకు ఈ హఠాత్ శబ్దాలకు గుండెదడ, నిద్రలేమి, మానసిక ఆందోళనలు తలెత్తుతాయి. ఇకపోతే మనతోపాటు జీవించే హక్కు భుక్తంగా ఉన్న పశుపక్ష్యాదులు, జంతువులకు విషమించే పరిస్థితిలో మృత్యువాత పడే అవకాశము ఉంటుంది.

## నీటికాలుష్యం:

బాణాసంచా తయారీలో ఎక్కువగా ఉపయోగించే పెర్క్లోరేట్ రసాయనాలు నీళ్ళలో కరగడం వలన నదులు, సరస్సులు కాలుష్య కాసారాలుగా మారిపోతాయి. తద్వారా సాగునీరు, త్రాగునీరు కలుషితం కావడమే కాకుండా వాటిలో జీవించే జలచరాదులు సైతం మరణించే అవకాశం ఉంటుంది. కనుక మనందరం పండుగ సంబరాలు జరుపుకోవడం ఎంత ముఖ్యమో! అదే విధంగా ఆ పండుగలను విచక్షణతో ఒకింత దృష్టిని పెట్టడం కూడా అంతే అవసరమన్న సత్యాన్ని గుర్తించి పండుగ జరుపుకోవచ్చు.

## కార్తీకమాసం ఆరంభం:

మహిళామణులంతా దీపావళి మరుసటి రోజునుండి కార్తీకమాసమంతా విశేషపూజ సంధ్యా సమయంలో మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. ఈ మాసంలో శివునికి కేదారేశ్వర వ్రతం హిందువులు ఆచరించే ఉత్కృష్టమైన వ్రతము. కార్తీకమాసములో చంద్రుడు కృత్తిక నక్షత్రంతో కలిసి వున్నరోజు కార్తీక పౌర్ణమి వస్తుంది.

ఈరోజు ఇంటిల్లిపాది కఠోర ఉపవాసాలుండి కేదారేశ్వరుని రూపంలోను శివుడిని ధ్యానిస్తారు. ఈ నోము నోచుకున్నవారికి అష్టైశ్వర్యాలకు, అన్నవస్త్రాలకు లోటుండదని భక్తులకు అపారమైన నమ్మకం. వ్రతం పూర్తి చేసిన అనంతరం నక్షత్రదర్శనం చేసుకుని స్వామికి నివేదించిన వాటినే ప్రసాదంగా తీసుకుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో కార్తీక సోమవారం ప్రత్యేక ఆచారాలు మరియు ఉపవాసాలు పాటించబడతాయి. కార్తీకమాసం అనగానే వనభోజనాల హడావిడి మొదలౌతుంది. ఊరువాడా సందడిగా ఉంటుంది.

"కార్తీక పురాణం";లో కార్తీక పౌర్ణమినాడు నైమిశారణ్యంలో మునులందరూ సూతమహర్షి ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నట్లు లిఖితమైంది. ఉసిరిచెట్టు కింద కార్తీక దామోదరునిగా ప్రఖ్యాతుడ్కైన శ్రీహరి ప్రతిమను ప్రతిష్ఠించి, ఉసిరికలతో హరిని పూజించి, గోవింద నామస్మరణ చేస్తూ షోడశోపచారాలతో పూజించి ఆనక వనభోజనాలు చేశారు. అలా పూర్వం మహర్షులు ఆచరించిన కార్తీక వనభోజనాలు ఇప్పటికీ ఏర్పాటు చేసుకుంటు న్నాం. నలుగురితో కలిసి ఆనందిస్తున్నాం.

## కార్తీకమాసంలో వనభోజనాలకు ఎంతో ప్రాధాన్యం:

కార్తీకమాసంలో వనభోజనాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనభోజనాలు మనకు చాటిచెబుతున్నాయి. దేశ సంస్కృతి సంప్రదాయాలను, హైందవ ధర్మ మార్గాన్ని అనుసరించి అనాదిగా వస్తున్న ఎన్నో పర్వదినాలను మనం పాటిస్తూ వస్తున్నాం. ఇందులో భాగమే కార్తీకమాసంలో జరుపుకునే వన సమారాధన కార్యక్రమం. దీనినే కార్తీక వనభోజనాలుగా పేర్కొంటారు.

## వనభోజనాల రీత్యా పెరిగే ఆత్మీయతానురాగాలు:

ఇలా వనభోజనం చేయడంవల్ల ఆధ్యాత్మిక ఫలితాలు, ఆరోగ్యంతో పాటు ప్రజల్లో ఆత్మీయతానురాగాలు పెంపొంది సామాజిక సామరస్యతకు, సమైక్యతకు దోహదం చేస్తుంది. ఆనందానికి సంకేతం పచ్చదనం, దాన్ని పంచుకుంటూ ఆనందాన్ని మనసులో నింపుకొంటూ చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు ఆటపాటలతో, నృత్య గీతాలతో ఆనందంగా గడుపుతారు. వనంలోకి వెళ్ళి ఆ ఉసిరి చెట్టు కింద, తులసి బృందా వనంలో చక్కగా వంట చేసుకుని, పరమేశ్వరుడికి మహా నైవేద్యం పెట్టి, అందరూ ఒక్కటిగా నిలబడి అన్నం తిని, ఆ ప్రకృతి అనుగ్రహాన్ని, పరమాత్మ అనుగ్రహాన్ని పొంది ఇంటికి తిరిగి రావడాన్ని వన భోజనమని అంటారు. వనభోజనం ఎందుకు నిర్దేశించారో ఆవిధంగా ఆచరించాలి.

అంతే తప్ప చేయకూడని పనుల కోసం వన భోజనాలకు వెళ్ళడం సరికాదు. దీపావళి కార్తీకమాసం పండుగలుజరుపుకుందాం. శ్రీ మహాలక్ష్మిని, పరమేశ్వరుడైన మహా శివుని అనుగ్రహానికి పాత్రులవుదాం.



-శారద శృంగేరి
94902 61119

# వరద కాలువపై ఎత్తిపోతల పథకంతో మేడిపల్లి, భీమారం మండలాలను సస్యశ్యామలం చేస్తాం

**-ప్రజలను మోసం చేసే పార్టీ, మోసం చేసే నాయకులన్నా పార్టీ కాంగ్రెస్**
**-ప్రతిపక్షాల మాటలు నమ్మి....మోసపోయి గోసపడొద్దు...**
**-బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ, లక్ష్మి నరసింహారావు**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): వరద కాలువపై ఎత్తిపోతల పథకంతో మేడిపల్లి, భీమారం మండలాలను సస్యశ్యామలం చేసి చూపిస్తామని బి.ఆర్.ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు హామీ ఇచ్చారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జగిత్యాల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఒద్దినేని హరి చరణ్ రావు, పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు దరువు ఎల్లన్నలతో కలిసి మేడిపల్లి, భీమారం మండలాల్లోని రంగాపూర్, కాచారం, విలయతాబాద్, వెంకట్రావుపేట్, రాగోజిపేట్, ఓడ్యాడ్, కమ్మరిపేట, భీమారం మండల కేంద్రం, గోవిందారం, పసునూర్, మోత్కురావుపేట, రాజలింగంపేట గ్రామాల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి చల్మెడ మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోరి, రైతు బంధు, రైతు భీమా ప్రవేశపెట్టిన రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అండగా నిలిచిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజలను మోసం చేసే పార్టీలని, అలాంటి పార్టీల నాయకుల మాటలు విని, వారిని గెలిపించి, మోసపోయి, గోసపడొద్దని సూచించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్న తనను గెలిపిస్తే, గెలిచిన 6నెలల్లోపు లింక్ రోడ్ల సమస్యలతో పాటు పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు రెండు మండలాల్లోని అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



**ఘన స్వాగతం పలికిన నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు**

ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు వెళ్లిన చల్మెడకు స్థానిక మహిళ సోదరీమణులు బతుకమ్మలతో, మంగళహారతులతో, టపాసుల మోతాలు డప్పు చప్పుళ్ళ మధ్య ఘన స్వాగతం పలికారు. వెంకట్రావుపేట గ్రామంలో మాజీ సర్పంచ్ అంగడి ఆనందం ఆధ్వర్యంలో కర్రతో చేసిన రైతు నాగలిని బహూకరించారు. వెంకట్రావుపేట గ్రామంలో బి.ఆర్.ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఉమా-రాజా రత్నాకర్ రావు, వైస్ ఎంపిపి దొంతి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ప్యాక్స్ చైర్మన్లు రవీందర్ రావు, పానుగంటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమ్య-ఆదిరెడ్డి, వైస్ చైర్మన్ కొప్పెర లింగారెడ్డి, నాయకులు అంకం సాగర్, రావు శ్రీనివాస రావు, ఎం.డి రాజబోస్ తో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ విభాగం అధ్యక్షులు, సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో మొదట ఓడిపోయేది భట్టి విక్రమార్కనే: తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్, నవంబర్ 11:తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎలాగూ ఓడిపోతుందని, అందులోనూ ఖమ్మం జిల్లాలో మొదట ఓడిపోయేది సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అని, ఇది రాసిపెట్టుకోవాలని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఓడిపోయే సీట్లలో మొట్ట మొదటిది మధిరనే అని, తాము సీపీఎంతో ఎందుకు పొత్తు పెట్టుకోలేదా అని భట్టి బాధపడతారని, కాంగ్రెస్‌కు బుద్ధి వస్తుందని అన్నారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి బరిలోకి దిగాలని సీపీఎం భావించింది. కానీ వారు అడిగిన స్థానాలు కాంగ్రెస్ పార్టీ ఇవ్వకపోవడంతో చర్చలు బెడిసికొట్టాయి. దాంతో ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తున్నామని తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. తాము ఒంటరిగా పోటీ చేయాలనుకోలేదని, కాంగ్రెస్ పార్టీ తమ మద్దతు వద్దనుకోవంతో సొంతంగా 19 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు.

త్రిపురలో తమ సిట్టింగ్ స్థానాన్ని పీసీసీకి వదిలేశామని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం మా కోసం త్యాగం చేయలేదని తమ్మినేని ఆరోపించారు. పొంగులేటి ఉన్నారనే కారణంతో పాలేరు ఇవ్వలేదన్నారు. వైరా, మిర్యాలగూడ సీట్లు ఇస్తామని చెప్పి చివరికి మిర్యాలగూడ ఒక్కటేనని కాంగ్రెస్ చెప్పిందని, దాంతో పొత్తు కుదరదని తేల్చుకున్నామని, అందుకే ఒంటరిపోరుకు సిద్ధమయ్యామని తమ్మినేని చెప్పారు.

# కార్తీకమాసంలో టీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్.. శైవ క్షేత్రాలకు స్పెషల్ బస్సులు

హైదరాబాద్, నవంబర్ 11:పండుగలు, ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని ప్రయాణికుల కోసం తెలంగాణ ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడుపుతున్నది. ఈ క్రమంలో పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. వేములవాడ, కాళేశ్వరం, రామప్పగుడి, వెయ్యి స్తంభాల గుడి, పాలకుర్తి తదితర శివాలయాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం, కార్తిక పౌర్ణమి ముందురోజు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి బయలు దేరుతాయని చెప్పారు. మళ్లీ దర్శనం అనంతరం సోమవారం రాత్రికి రాజధానికి చేరుకుంటాయని తెలిపారు.

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, పంచారామ క్షేత్రాలకు బస్సులు నడపనున్నారు. ఈ బస్సులు కూడా ప్రతి ఆదివారం,

పౌర్ణమి ముందు రోజు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరనున్నాయి. తిరిగి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి.

# కాంగ్రెస్ నాయకులను తరిమికొట్టండి-మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 10: ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకు వచ్చి ఓట్లడిగే పార్టీలను తరిమికొట్టాలని మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రజలకు సూచించారు.

మండల పరిధి ప్రతాపసింగారంలో శుక్రవారం రాత్రి జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. అధికార కాంక్షతో కాంగ్రెస్ పార్టీ నీతినియమాలు తప్పిందని, అనేక అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసం లేదని, స్వార్థపూరిత రాజకీయాలు చేసే నాయకులకు పతనం తప్పదన్నారు.

దేశం లో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పా రు. ఉచిత విద్యుత్‌పై అక్కసు కక్కిన కాంగ్రెస్ పార్టీ రైతులను ఓట్లు అడిగే హక్కును కోల్పోయిందన్నారు. వృద్ధులకు పెద్ద కొడుకుగా, యువతకు అన్నగా కేసీఆర్ ఆదుకుంటున్నాడని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు తెలంగాణ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు.

# బీఆర్ఎస్ గూటికి కౌన్సిలర్ రామతీర్థపు కృష్ణవేణి-హరీష్

**- 'చెల్మెడ' సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిక**



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని 12వ వార్డ్‌బీజేపీ కౌన్సిలర్ రామతీర్థపు కృష్ణవేణి- హరీష్ లు ఆ పార్టీని వీడి శనివారం బిఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహ రావు సమక్షంలో శనివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి లక్ష్మీ నరసింహ రావుకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి-రాజు, కౌన్సిలర్లు ముప్పిడి సునంద-శ్రీనివాస్,గడ్డమీది లావణ్య-శ్రీనివాస్, సీనియర్ నాయకులు కట్కూరి శ్రీనివాస్,గజానంద రావు, వెంకటేశ్వర రావు, గోపు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌ను గెలిపించాలి -సిపిఐ, నాయకుల ప్రచారం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): , కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని శనివారం పట్టణంలోని పలు వార్డులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిపిఐ నాయకులతో విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో దొరల పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, సిపిఐ నాయకులు కడారి రాములు, నాయకులు చిలుక రమేష్ కూరగాయల కొమరయ్య, పాత సత్యలక్ష్మి, పులి రాంబాబు గౌడ్ బొందిల మహేష్, కనికరపు రాకేష్, కూరగాయల శ్రీశైలం, తోట రాజు, ముప్పిడి శ్రీధర్, బైరి సతీష్, కోలకాని రాజు, అక్కనపెల్లి నరేష్, నాగుల రాము, గుర్రం తిరుపతి, కుతాడి రాజేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.